



న్యూస్‌టుడే, కాశీబుగ్గ

పలాస జీడిపప్పునకు పండగ శోభ వచ్చింది.. వచ్చే దసరా, దీపావళి నేపథ్యంలో ఎగుమతులు ఊపందుకున్నాయి. ఇదే సమయంలో డిమాండ్‌తో పాటు ధరలు కూడా పెరిగాయి. మరోపక్క కార్మికులకు చేతినిండా పని దొరికింది.

పలాస జీడికి.. పండగే పండగ!

పప్పు శ్రేణీకరణ చేస్తున్న కార్మికులు

భారీగా పెరిగిన పప్పు ఎగుమతులు



ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి..

పలాస జీడిపప్పు దక్షిణ రాష్ట్రాల కంటే ఉత్తరాది రాష్ట్రాలకే అధికశాతం ఎగుమతి అవుతుంది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బిహార్, ఝార్ఖండ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో దసరా, దీపావళి పండగల్లో జీడి పప్పు వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో అక్టోబరులో ఎగుమతులు అందుకు తగ్గట్టుగానే ఉంటాయి. దీంతో కార్మికులకు చేతి నిండా పని ఉంటుంది. రాత్రీపగలూ పనిచేస్తారు. ఒక్క జీడి పరిశ్రమల్లో పనిచేసే వారే కాక వీటిపై ప్రత్యక్ష, పరోక్షంగా ఆధారపడి జీవనం సాగిస్తున్న కార్మికులకు సైతం ఖాళీ ఉండదు. వర్తకులు సైతం ఏడాదిలో జరిగే వ్యాపారం కంటే ఈ నెల రోజుల వ్యాపారంపైనే ఆశలు పెట్టుకుంటారు. జిల్లాలో దాదాపు 370 జీడి పప్పు తయారీ కర్మాగారాలుండగా పలాస నియోజకవర్గం పరిధిలో 300 వరకు ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు సగటున వంద టన్నుల వరకు జీడి పప్పు ఉత్పత్తి జరుగుతుంది. ఇందులో 60 శాతం వరకు ఉత్తరాది రాష్ట్రాలకే ఎగుమతి అవుతోంది. రెండు నెలలు కాలంలో కిలో దగ్గర రూ.80 నుంచి రూ.100 వరకు ధర పెరిగింది.

మహాలక్ష్మీ నమోస్తుతే..

జిల్లావ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి.. ఆలయాలు, దేవీ పీఠాలు, మండపాల్లో కొలువుదీరిన దుర్గమ్మ భిన్న రూపాల్లో భక్తులకు దర్శనమిస్తున్నారు.. ఊరూరా శరణుఘోష మార్మోమోగుతోంది. మహిళలు సామూహిక కుంకుమ పూజలు, ప్రత్యేక అభిషేకాలు చేస్తున్నారు. ఎటుచూసినా దసరా సందడే దర్శనమిస్తోంది. మంగళవారం మహాలక్ష్మి అలంకరణలో అమ్మ పూజలందుకున్నారు. టెక్కలి పట్టణంలో మహాలక్ష్మి అలంకరణలో శివదుర్గాదేవిని చిత్రంలో చూడొచ్చు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం



రూ.50కే కిలో టమాటా

రైతుబజార్ల ద్వారా పంపిణీ

బహిరంగ విపణిలో టమాటా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోవడంతో దిగుబడి బాగా తగ్గిపోయింది. ధరలు అమాంతం పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించింది. రైతు బజార్ల ద్వారా రాయితీపై సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టింది. ఆధార్ కార్డు తీసుకువచ్చినవారికి రూ.50కే కిలో విక్రయిస్తున్నారు. శ్రీకాకుళం నగరంలోని రైతు బజారు వద్ద టమాటాల కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న వినియోగదారులను చిత్రంలో చూడవచ్చు. – న్యూస్‌టుడే, కలెక్టరేట్(శ్రీకాకుళం)



3,071 అభివృద్ధి పనులు గుర్తింపు: కలెక్టర్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జిల్లాలో పల్లె పండగ కార్యక్రమాన్ని ప్రణాళికబద్ధంగా సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ కార్యక్రమం అమలుపై మంగళవారం కలెక్టర్లతో దూరదృశ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అన్ని పంచాయతీల పరిధిలో 3,071 అభివృద్ధి పనులు గుర్తించినట్లు చెప్పారు. వాటికి సంబంధించి రూ.249 కోట్లు అంచనా వేసినట్లు వివరించారు. ఇప్పటి వరకు 2714 పనుల ప్రతిపాదనలకు అనుమతులిచ్చామని, మిగిలినవి రెండు రోజుల్లో పూర్తి చేస్తామన్నారు. పనులు చేసేందుకు ఇసుక కొరత లేదని, సిమెంట్‌కు సంబంధించి డీలర్లతో మాట్లాడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఎల్ఎన్‌వీ శ్రీధర్ రాజా, డ్వామా పీడీ బి.సుధాకర్, డీపీవో కె.భారతి సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలకు సిద్ధం కండి

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. కలెక్టరేట్ నుంచి అధికారులతో మంగళవారం దూరదృశ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ, మధ్య, చిన్న నీటి పారుదల ప్రాజెక్టులవారీగా వచ్చే నెలనాటికి ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని, అందుకు అనుగుణంగా ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. ఆయకట్టు, డిస్ట్రిబ్యూటరీలు, ప్రాజెక్టుల పరిధిలో కొత్తగా వచ్చిన ప్రాంతాలను కలిపి ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. అన్ని శాఖలు కోర్టు కేసుల విషయమై తక్షణమే స్పందించాలని సూచించారు. నాలా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకూడదని ఆర్డీవోలను ఆదేశించారు. ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పల్లె పండగ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించాలన్నారు. ఎచ్చెర్లలో మూడు డయేరియా కేసులు నమోదయ్యాయని, వైద్యారోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో అప్పారావు, ఆర్డీవోలు, తదితరులు పాల్గొన్నారు.

సర్వజనాసుపత్రిలో పడకలు: 990 | **నిత్యం ఓపీకి వచ్చేవారు: 600-700 మంది** | **ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందేవారు: 350-400 మంది**

నాడి పట్టేవారేరి..?

- సర్వజనాసుపత్రిలో కీలక విభాగాల్లో వైద్యుల కొరత
- అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక వైద్యానికే పరిమితం

న్యూస్‌టుడే, గుజరాతీపేట(శ్రీకాకుళం)

పేరుకే అది పెద్దాసుపత్రి. అక్కడ కీలక విభాగాల్లో వైద్యులు మాత్రం ఉండరు.. ఫలితంగా వైద్యసేవలు అందడం గగనంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో రోగులను తీసుకొస్తే ప్రాథమిక చికిత్సతో సరిపెడుతున్నారు.. ఒక్కోసారి నాడి పట్టకుండానే విశాఖపట్నం లేదా నగరంలోని కార్పొరేట్ ఆసుపత్రులకు తీసుకెళ్లాలని సిఫార్సు చేస్తున్నారు. అంబులెన్స్ మాట్లాడుకుని వెళ్లేలోపు కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. పేద, మధ్యతరగతి ప్రజలకు సరైన వైద్యం అందక అవస్థలు తప్పడం లేదు. శ్రీకాకుళం నగరంలోని సర్వజనాసుపత్రిని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టాలని.. ఆ దిశగా ప్రజాప్రతినిధులు దృష్టి పెట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.


ప్రభుత్వ సర్వజనాసుపత్రి

శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రి, వైద్య కళాశాలలోని కీలక విభాగాల్లో ప్రొఫెసర్ పోస్టుల ఖాళీలు భర్తీ చేయకపోవడంతో సూపర్ స్పెషాలిటీ వైద్యం అందట్లేదు. కీలకమైన ఆర్థోపెడిక్, పిడియాట్రిక్, డెర్మటాలజీ, న్యూరాలజీ, న్యూరోసర్జన్, టీబీ, శ్వాసకోశ వ్యాధి, ఫొరెన్సిక్, సర్జరీ విభాగాల్లో ఖాళీలు ఎన్నాయి. మరోవైపు కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ విభాగాలు ఏర్పాటు చేయలేదు.

ఇదీ పరిస్థితి

ప్రభుత్వ వైద్య కళాశాలలో 22 ప్రొఫెసర్ పోస్టులకు 9, 60 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు 20, 110 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 30 భర్తీ చేయాల్సి ఉందని సమాచారం. ఇన్ని ఖాళీలు ఉంటే వైద్య విద్యార్థులకు పాఠ్యాంశాలు ఎలా బోధిస్తున్నారనే విషయం చర్చనీయాంశంగా మారింది. సర్వజనాసుపత్రిలో రోగులకు సేవలు సక్రమంగా అందట్లేదనే విషయం స్పష్టమవుతోంది.

విశాఖ నుంచి రాకపోకలు

ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ట్యూటర్లు విశాఖపట్నం నుంచి శ్రీకాకుళానికి రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం 9కి వచ్చి మధ్యాహ్నం రెండు గంటల తరువాత తిరిగి వెళ్లిపోతుండటంపై విమర్శలు వస్తున్నాయి.

ప్రజాప్రతినిధులు పట్టించుకుంటే మేలు


ప్రభుత్వ సర్వజనాసుపత్రి, వైద్య కళాశాలలో కీలక విభాగాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కొత్తగా మంజూరైన కార్డియాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ విభాగాలు ఏర్పాటు చేస్తే జిల్లా ప్రజలకు ఉన్నత వైద్యం అందుతుంది. వైద్యులు, సిబ్బంది రాకపోకలపై పటిష్ఠ చర్యలు తీసుకుంటే చికిత్స, వైద్య విద్య బోధన గాడిలో పడే అవకాశం ఉంది.

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.. సర్వజనాసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యులు, ఇతర సిబ్బంది పోస్టుల వివరాలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో భర్తీ అయ్యే అవకాశం ఉంది. అప్పటివరకు సీనియర్ వైద్యులతో వైద్యం చేయిస్తాం. విశాఖ నుంచి వైద్యుల రాకపోకల విషయంలో చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ షకీల, మెడికల్ సూపరింటెండెంట్, సర్వజనాసుపత్రి, శ్రీకాకుళం

ప్రాణం తీసిన రాజకీయ కక్ష..!

- వనవిష్ణుపురంలో కర్రలతో వైకాపా శ్రేణుల దాడి
- తెదేపా కార్యకర్త హత్య, మరొకరికి గాయాలు

రాజకీయ కక్ష కటలు తెంచుకుంది.. క్షణికావేశం నిండు ప్రాణాన్ని బలితీసుకుంది.. మేమంటే మేమనే పంతం ఓ ఇంటి దీపాన్ని ఆర్పేసింది.. ఎన్నికలు ముగిశాయి.. రాజకీయాలు సద్దుమణిగాయి.. కానీ ఆ ఊరిలో మాత్రం నివురుగప్పిన నిప్పులా ఇంకా భగభగమండుతూనే ఉన్నాయి.. అమ్మవారి ఉత్సవాలను అదనుగా చూసుకుని వైకాపా శ్రేణులు తెదేపా వర్గీయులపై దాడులకు తెగబడ్డారు. ఈ ఘటన పోలాకి మండలం వనవిష్ణుపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది ..


పాలిన వీరాస్వామి (పాతచిత్రం)


నరసన్నపేట ఆసుపత్రి వద్ద వివరాలు తెలుసుకుంటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

న్యూస్‌టుడే, పోలాకి, నరసన్నపేట

గ్రామంలో అమ్మవారి వారాల పండగలు జరుగుతున్నాయి. రాజకీయ కారణాలతో తెదేపా, వైకాపా వర్గీయులు వేర్వేరుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తెదేపా వర్గీయులు మంగళవారం, వైకాపా వర్గీయులు గురువారం వారాలు నిర్వహించుకోవాల్సి ఉంది. ఉత్సవాల్లో భాగంగా కొమ్మల వేతకు అంతా సిద్ధమవుతున్నారు. అయితే మంగళవారమే తాము వారాలు నిర్వహిస్తామని, మీరే గురువారానికి వాయిదా వేసుకోవాలని తెదేపా వారికి వైకాపా నేత కృష్ణమూర్తి సూచించారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ సమయంలో ఒక్కసారిగా కర్రలు, కత్తులతో వైకాపా శ్రేణులు దాడులకు పాల్పడినట్లు గ్రామానికి చెందిన తెదేపా నాయకులు తెలిపారు. ముందస్తుగా కర్రలు, రాళ్లు సిద్ధం చేసుకుని దాడులు చేయడంతో తెదేపా వర్గాలు పరుగులు తీశాయి. ఈ ఘటనలో పాలిన వీరాస్వామి(48)కి తీవ్ర గాయాలు కావడంతో వెంటనే ద్విచక్ర వాహనంపై నరసన్నపేట ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందారు. పాలిన రామారావుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం నరసన్నపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరాస్వామికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.


గాయపడిన పాలిన రామారావు

ఎస్పీ పరిశీలన

నరసన్నపేట ఆసుపత్రిలో వీరాస్వామి మృతదేహాన్ని ఎస్పీ మహేశ్వరరెడ్డి పరిశీలించారు. గాయపడిన రామారావుతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఘటన నేపథ్యంలో వనవిష్ణుపురంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 150 మంది పోలీసులతో గస్తీ నిర్వహిస్తున్నారు.

వైకాపా ఆగడాలకు అదుపులేకుండా పోతోంది... ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ వైకాపా విష సంస్కృతిని ఇంకా ఆపలేదు. వీరి ఆగడాలకు అదుపులేకుండా పోతోంది. వైకాపా రాక్షసుల దాడిలో తెదేపా కార్యకర్త మృతిచెందడం బాధాకరం. అతని కుటుంబానికి అండగా ఉంటాం. దోషులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.
– కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర మంత్రి

రేపు జిల్లా కాంగ్రెస్ కమిటీల నియామకం

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఈ నెల 10న పార్టీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, అనుబంధ సంఘాల కమిటీ సభ్యులను నియమించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వివిధ విభాగాలతో పాటు మండల, పంచాయతీల పార్టీ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలను అధికారికంగా ప్రకటిస్తామన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

న్యూస్‌టుడే, బలగ (శ్రీకాకుళం)

కరోనా కారణంగా కొందరు చిన్నారులు అమ్మానాన్నలకు కోల్పోయి అనాథలయ్యారు.. ఇంకొందరు తల్లినో.. తండ్రినో పోగొట్టుకుని అభ్యాగులుగా మారారు. అలాంటి వారిని ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2022లో 'మిషన్ వాత్సల్య' పథకానికి శ్రీకారం చుట్టాయి. గత వైకాపా ప్రభుత్వం లబ్ధిదారులను ఎంపిక నుంచి సాయం అందించడం వరకు తీవ్ర నిర్లక్ష్యం చూపింది. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేసి అభాగ్యుల కళ్లలో ఆనందం నింపింది. తాజాగా రెండో విడతలో మరికొందరికి లబ్ధి చేకూర్చే దిశగా అడుగులు వేస్తోంది.

- రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు
- ఈనెల 25 వరకు దరఖాస్తుకు గడువు

వాత్సల్యం చూపుతున్నారు..!

జిల్లాలో 16 ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. తొలి విడతలో మొత్తం 437 మంది లబ్ధిదారులను అధికారులు గతేడాది ఎంపిక చేశారు. వైకాపా నిర్వాకంతో వారికి సాయం అందలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే దీనిపై దృష్టి సారించింది. జిల్లాలో పరిధిలో గుర్తించిన చిన్నారులకు ప్రయోజనం చేకూర్చింది. 2023 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు ఆరు నెలల ఆర్థిక సాయం ఒకేసారి ఈ ఏడాది ఆగస్టులో రూ.1.04 కోట్లు జమ చేసింది. తాజాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండో విడత లబ్ధిదారుల ఎంపికకు కసరత్తు చేస్తున్నారు. ఈసారి 786 మందికి సాయం అందించనున్నారు. ఈ మేరకు ఐసీడీఎస్ ప్రాజెక్టుల వారీగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు.

అర్హులు ఎవరంటే..

- 2025 మార్చి 31 నాటికి 18 ఏళ్లలోపు వయసు ఉన్నవారు.
- తల్లిదండ్రులు ఇద్దర్నీ కోల్పోయినవారు
- దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న దంపతుల పిల్లలు
- బాలల న్యాయ చట్టం-2015 ప్రకారం నిరాదరణకు గురైనవారు
- కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణాల్లో రూ.96 మించనివారు.

ఎవర్ని సంప్రదించాలి..

అర్హులైనవారు సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలి. దరఖాస్తుతో పాటు చిన్నారుల జనన, ఆదాయ, కుల ధ్రువపత్రాలు, తల్లిదండ్రులు/ సంరక్షకుల ఆధార్, రేషన్ కార్డు నకళ్లు, బ్యాంకు పాసు పుస్తకం, ఇతర పత్రాలతో గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరిగా ఉండాలి. ఎంపికలో ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో చదువుతున్నవారికి ప్రాధాన్యమిస్తారు. ఈ నెల 25లోపు అర్హులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ప్రక్రియ ప్రారంభించాం..

జిల్లాలో మిషన్ వాత్సల్య పథకం రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించాం. ఇప్పటికే ప్రాజెక్టులవారీగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. 16 ప్రాజెక్టుల పరిధిలో 786 మందికి సాయం అందించనున్నాం. దరఖాస్తులను పరిశీలించిన తర్వాత నిబంధనల ప్రకారం తుది జాబితా ప్రకటిస్తాం.
- కె.వి.రమణ, జిల్లా బాలల రక్షణ అధికారి, శ్రీకాకుళం

విద్యుదాఘాతంతో భవానీ దీక్షాధారుడి మృతి


మణికంఠ (పాత చిత్రం)

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై భవానీ దీక్షాధారుడు మృతి చెందిన ఘటన కంచిలి మండలం నారాయణబట్టి గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు దేవీ శరన్నవరాత్రుల సందర్భంగా గ్రామానికి చెందిన కొందరు భవానీ మాల ధరించారు. ఊరి చివరన గ్రామ దేవత ఆలయం వద్ద సన్నిధానం ఏర్పాటు చేసుకుని పూజలు చేస్తున్నారు. అదే గ్రామానికి చెందిన కోన చిరంజీవి కుమారుడు మణికంఠ(18) కూడా భవానీ దీక్షలో ఉన్నాడు. సన్నిధానం వద్ద మంగళవారం ఉదయం పూజలు పూర్తయిన అనంతరం మధ్యాహ్నం భిక్ష తయారు చేయడానికి సిద్ధమయ్యారు. పప్పు కడగడానికి మణికంఠ బకెట్‌తో నీరు తీసుకొస్తుండగా ఆలయం వద్ద విద్యుద్దీపాలంకరణకు ఏర్పాటు చేసిన తీగను తాకాడు. విద్యుదాఘాతానికి గురవడంతో తోటి దీక్షాధారులు హుటాహుటిన సోంపేట ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అతను మృతి చెందాడు. మణికంఠ ప్రస్తుతం బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. తండ్రి మంగోలియాలో, తల్లి చిన్నారి గ్రామంలో కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. కుమారుడి హఠాన్మరణంతో ఆమె కన్నీరుమున్నీరుగా రోదిస్తోంది. ఘటనపై ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టాఫ్ నర్సును కబళించిన డెంగీ


లక్ష్మీ

నందిగాం, న్యూస్‌టుడే: టెక్కలి జిల్లా ఆసుపత్రిలో ఒప్పంద ప్రాతిపదికన స్టాఫ్ నర్సుగా పని చేస్తున్న నందిగాం మండలం సుభద్రాపురం గ్రామానికి చెందిన ఎం.లక్ష్మీ(35) డెంగీతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీ రెండు రోజుల కిందట ఇద్దరు పిల్లలను కాశీబుగ్గలోని కన్న వారింట్లో విడిచిపెట్టి దేవుడి సేవ నిమిత్తం సహచర సిబ్బందితో కలిసి తిరుమల వెళ్లారు. కొండపైకి చేరుకోగానే కళ్లు తిరుగుతున్నాయి, నీరసంగా ఉందని చెప్పడంతో ఆమెతో వెళ్లినవారు మంగళవారం అక్కడే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించారు. డెంగీ లక్షణాలు ఉన్నాయని ప్లేట్‌లెట్స్ తగ్గి పోయాయని చెప్పి మందులు ఇచ్చారు.

మృతదేహాన్ని వదిలేసి వెళ్లిపోయారు..

నీరసం తగ్గలేదని కళ్లు తిరుగుతున్నాయని చెప్పి లక్ష్మీ కూర్చున్న చోటనే కిందపడి మృతి చెందారు. ఆమెతో వెళ్లిన సహచరులు మృతదేహాన్ని వదిలేసి ఎక్కడికో వెళ్లిపోయారు. బ్యాగులో ఉన్న ఆధార్, గుర్తింపు కార్డు చూసిన వైద్యులు టెక్కలి ప్రాంతీయాసుపత్రికి సమాచారం అందించారు. వారు సుభద్రాపురం బంధువులకు విషయం తెలియజేశారు. అక్కడి వైద్యులు అంబులెన్స్‌లో మృతదేహాన్ని సుభద్రాపురం పంపిస్తున్నారు. భర్త మాధవరావు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

నేలబావిలో పడి రైతు మృత్యువాత


రాము

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: ఉన్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో టమాటా పండిస్తున్న రైతు ప్రతి రోజూలాగానే నీరు కట్టేందుకు వెళ్లి నేలబావిలో ప్రమాదవశాత్తు జారిపడి మృత్యువాత పడిన ఘటన చిన్నబమ్మిడి పంచాయతీ సుబ్బారావుపేటలో మంగళవారం చోటుచేసుకుంది. హెచ్‌సీ ఎ.విశ్వేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఇప్పిలి రాము(53) తనకున్న పది సెంట్ల భూమిలో టమాటా పండిస్తున్నారు. ఎండల నేపథ్యంలో టమాటాకు నీరు పెట్టేందుకు వెళ్లి ఇంటికి ఎంతసేపటికీ రాకపోవడంతో కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లి చూడగా నేలబావిలో విగతజీవిగా కనిపించారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం


సంజీవమ్మ

నందిగాం, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై నుంచి జారిపడి వృద్ధురాలు మృతి చెందిన ఘటన నందిగాం మండలంలోని జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగాం పంచాయతీ కొండపేటకు చెందిన కుద్దుమ సంజీవమ్మ(73) మంగళవారం అదే గ్రామానికి చెందిన బొడ్డ జనార్దనతో కలిసి ద్విచక్ర వాహనంపై వల్లభరాయపాడు పంచాయతీ మణిగాం వెళ్లారు. తిరిగి గ్రామానికి వస్తుండగా మణిగాం వద్ద ఆమె బండిపై నుంచి జారిపడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. టెక్కలి జిల్లా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. భర్త చనిపోగా, ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ డిల్లేశ్వరరావు తెలిపారు.

పురపాలక ఇంజినీరింగ్ అధికారులకు సంజాయిషీ నోటీసులు

పలాస, న్యూస్‌టుడే: పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో గతంలో పని చేసిన ముగ్గురు ఇంజినీరింగ్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం సంజాయిషీ నోటీసులు జారీ చేసింది. ఈఈ పి.వెంకటరావు, డీఈఈలు కె.దక్షిణామూర్తి, ఎస్.చిరంజీవులు ఇక్కడ పని చేసిన కాలంలో జరిగిన అక్రమాలపై సరైన నివేదిక ఇవ్వలేకపోవడంతో 15 రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని మంగళవారం పురపాలక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్వర్తులు జారీ చేశారు.

ఎస్‌బీఐ సీజీఎం ఆకస్మిక పర్యటన


శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) చీఫ్ జనరల్ మేనేజరు(సీజీఎం) రాజేష్‌కుమార్ పటేల్ మంగళవారం జిల్లాలో పర్యటించారు. శ్రీకాకుళం నగరంలోని బ్యాంకు ప్రాంతీయ కార్యాలయంతో పాటు రామలక్ష్మణ, అరసవల్లి శాఖలను సందర్శించారు. గారశాఖకు సంబంధించిన బంగారం కేసు దర్యాప్తు జరుగుతున్న సమయంలో సీజీఎం రావడం బ్యాంకు వర్గాల్లో చర్చనీయాంశమైంది.



ఊరూరా వారాల సందడి

జిల్లాలోని పలు గ్రామాల్లో మంగళవారం దసరా వారాలు సందడిగా జరిగాయి. జలుమూరు మండలంలోని పెద్దదూగాం, లింగాలవలస, రాణా, కరవంజ, గుగ్గిలి, తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు ముర్రాటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దదూగాంలో పెద్దమ్మతల్లి గుడి వద్ద ఊడిక కొమ్మలతో వందల సంఖ్యలో రైతులు పూజలు నిర్వహించారు. పాడి పంటలు బాగుండాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం అమ్మవారి పాదాల చెంత ఉన్న కొమ్మలను పంట పొలాల్లో పాతి పెట్టారు. – న్యూస్‌టుడే, జలుమూరు

సంస్కృతికి నెలవు.. బొమ్మల కొలువు



దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా జిల్లావ్యాప్తంగా పలు ఆలయాలతో పాటు గృహాల్లో బొమ్మలు కొలువులు ఏర్పాటు చేశారు. పురాణేతిహాసాల్లోని అంశాలు, పల్లె, పట్టణాల సంస్కృతి, భావితరాలకు తెలియజెప్పాలనే ఉద్దేశంతో వీటిని పెడుతుంటారు. శ్రీకాకుళం నగరంలో ఆదిత్యాలయం ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఇంట్లో కొలువుదీర్చిన బొమ్మలు కొలువు అందరినీ ఆకట్టుకుంటోంది. అదే ఈ చిత్రం.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

– న్యూస్‌టుడే, ఎచ్చెర్ల, రణస్థలం


కష్టపడి సంపాదించుకున్న విద్యార్హత ధ్రువపత్రాలు పోతే ఏం చేయాలి..?
ఏదైనా ప్రమాదంలో కాలిపోయో.. చిరిగిపోయో వాటిని కోల్పోతే పరిస్థితేంటి?
అవి లేకుండా ఉన్నత చదువులు, ఉద్యోగాలకు దరఖాస్తు చేయడమెలా?
వాటిని తిరిగి పొందాలంటే ఇంకెన్ని ఇబ్బందులు పడాలి?
ఆధార్, రేషన్, పాన్ కార్డులైనా పోగొట్టుకుంటే ఎంత బాధ పడాలి..?
వీటన్నింటికీ పరిష్కారం చూపుతోంది ‘డిజీ లాకర్’..

ధ్రువపత్రం.. ఇక భద్రం..!

‘డిజీ లాకర్’లో దాచుకునేందుకు అవకాశం



డిగ్రీ పట్టాల నుంచి బ్యాంకు పుస్తకాలు వరకు, ఆధార్ కార్డు నుంచి ఆస్తి కాగితాల వరకు ఎన్నో పత్రాలను మనం భద్రంగా దాచుకుంటాం. పొరపాటున అవి పోయాయంటే తిరిగి పొందేందుకు నానా ఇక్కట్లు పడాల్సిందే. ఈ సమస్యను అధిగమించేందుకు విశ్వవిద్యాలయాల నిధులు మంజూరు సంస్థ(యూజీసీ) సూచన మేరకు కేంద్ర ప్రభుత్వం డిజీ లాకర్ పోర్టల్, యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ వెబ్‌సైట్‌లో మొత్తం సమాచారాన్ని క్లౌడ్ డేటా బేస్‌లో భద్రపరుస్తున్నారు. డిజీ లాకర్‌తో అనుసంధానమైన ప్రభుత్వశాఖలు అందించే అన్ని పత్రాలను ఇందులో దాచుకోవచ్చు. అందుకుగాను ఆయా పత్రాల రిజిస్ట్రేషన్ సంఖ్య నమోదు చేస్తే చాలు. ఒకవేళ అనుసంధానం కాకపోతే స్కాన్ చేసిన పత్రాలను భద్రపరుచుకునే అవకాశమూ ఉంది.



ప్రభుత్వ ఆదేశాలతో..

పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీకి సంబంధించి మార్కుల జాబితాలు, ఓడీలు, ఇతర ధ్రువపత్రాలను సంబంధిత బోర్డులే ఇందులో పొందుపరుస్తున్నాయి. ఆ ప్రక్రియను అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే పలు విశ్వవిద్యాలయాలు విద్యార్థులు ఈ డిజీ లాకర్‌లో ధ్రువపత్రాలు భద్రపరుచుకునే చర్యలు చేపడుతున్నాయి. జిల్లాలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ, పీజీ, బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ, డీపీఈడీ, ఇంజినీరింగ్ కళాశాలల నుంచి ఏడాదికి సుమారుగా 25 వేల మంది పలు కోర్సులు పూర్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారందరి మార్కుల జాబితా, ఓడీలను అధికారులు డిజీ లాకర్ యాప్‌లో భద్రపరిచేలా చర్యలు తీసుకొంటున్నారు. వర్సిటీకి సంబంధించి 2010 నుంచి ఈ వివరాలు పొందుపరుస్తున్నారు.

ఇలా చేయాలి..

- గూగుల్ ప్లేస్టోర్ నుంచి డిజీ లాకర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఇన్‌స్టాల్ అయ్యాక మీ పేరు, పుట్టిన తేదీ, ఈ-మెయిల్, ఫోన్ నంబరు పొందుపరచాలి.
- మొబైల్‌కు వచ్చే వన్ టైం పాస్‌వర్డ్(ఓటీపీ) నమోదు చేయగానే యాప్‌ను ప్రారంభమవుతుంది.
- ఆ తర్వాత పాన్‌కార్డు, ఆధార్, పది, ఇంటర్, డిగ్రీ, పీజీ ఇలా ధ్రువపత్రాలు, కార్డుల జాబితా కనిపిస్తుంది. వాటిలో కావాల్సినవి ఎంచుకొని అప్‌లోడ్ చేయాలి.
- అలా రాని పక్షంలో డిజీ లాకర్ డ్రైవ్‌ను ఓపెన్ చేసి మాన్యువల్ విధానంలో భద్రపరుచుకోవచ్చు. వెబ్‌సైట్ ద్వారా కూడా సేవలు పొందవచ్చు.

ఇవీ దాచుకోవచ్చు..

ఆధార్, రేషన్, పాన్, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, విద్యార్హత ధ్రువపత్రాలు, మార్కుల జాబితాలు, కుల, ఆదాయ, జనన పత్రాలు, ఆస్తి, రిజిస్ట్రేషన్, ఆరోగ్య బీమా కాగితాలు ఇలా అనేక పత్రాలు, కార్డులు భద్రపరచుకోవచ్చు.

సదుపాయం వినియోగించుకోవాలి..



బీఆర్‌ఏయూలో చదువుకున్న విద్యార్థుల డిగ్రీలు, ఓడీలు, మార్కుల జాబితాలు అక్టోబర్ నెలాఖరు నాటికి అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. 2010 నుంచి 2015 విద్యాసంవత్సరం వరకు వివిధ కోర్సుల్లో ఉత్తీర్ణులైనవారి పత్రాలు ఇప్పటికే డిజీ లాకర్‌లో అందుబాటులో ఉంచాం. మిగిలినవి కూడా త్వరలో పొందుపరుస్తాం. మన పత్రాలు ఇందులో ఉంటే ఎక్కడి నుంచే వాటిని తీసుకోవచ్చు. విద్యార్థులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలి. – డా.ఎస్.ఉదయ్‌భాస్కర్, డిజీ లాకర్ వర్సిటీ సమన్వయకర్త, బీఆర్‌ఏయూ

నేడు డయల్ యువర్ ఎంపీ

విజయనగరం, న్యూస్‌టుడే: విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా బుధవారం డయల్ యువర్ ఎంపీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు మంగళవారం తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, సిరిమాను ఊరేగింపు, సమస్యలు.. తదితర వాటిపై సలహాలు, సూచనలివ్వాలని కోరారు. ఎంపీ- 94404 36426, క్యాంపు కార్యాలయం- 89190 60911, నగరపాలక సంస్థ కమిషనర్- 98499 06486 నంబర్లను సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల మధ్య సంప్రదించాలన్నారు.

క్షేత్ర సహాయకుడి సస్పెన్షన్

కొత్తూరు, న్యూస్‌టుడే: కొత్తూరు మండలంలోని కుంటిభద్ర గ్రామానికి చెందిన ఉపాధిహామీ పథకం క్షేత్ర సహాయకుడు ఎ.షణ్ముఖరావును సస్పెండ్ చేస్తూ డ్వామా పీడీ సుగుణాకరావు ఆదేశాలు జారీ అయినట్లు ఎంపీడీవో నీరజ, ఏపీవో ప్రేమలత మంగళవారం తెలిపారు. ఉపాధి పథకం పనుల్లో అవకతవకలకు పాల్పడటంతో పాటు, గతంలో జరిగిన కొట్లాటలో సదరు క్షేత్ర సహాయకుడిపై కేసు నమోదైందని గ్రామానికి చెందిన సీహెచ్ భద్రాచలం జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వీటన్నింటిపై విచారణ చేపట్టిన అధికారుల నివేదిక ఆధారంగా పీడీ వేటు వేసినట్లు వారు చెప్పారు.

ప్రజావారధిగా పని చేస్తా


కృష్ణచంద్రపురంలో హైకోర్టు పీపీ లక్ష్మీనారాయణకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: రాజకీయలతీతంగా ప్రభుత్వం, ప్రజలకు మధ్య ప్రజావారధిగా సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని రాష్ట్ర హైకోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) మెండ లక్ష్మీనారాయణ తెలిపారు. సంతబొమ్మాళి మండలం చిన్నతుంగం పంచాయతీ కృష్ణచంద్రపురం స్వగ్రామానికి బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి రావడంతో గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు మంగళవారం ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. పేద కుటుంబం నుంచి ఈ స్థాయికి వచ్చానని, దివంగత నాయకులు కింజరాపు ఎర్రన్నాయుడు తనకు ఎంతగానో ప్రోత్సాహం అందించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. యువత ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే తప్పనిసరిగా చదువు ముఖ్యమని తెలిపారు. 2014-19 మధ్య హైకోర్టు సహాయ పీపీగా పనిచేశానని, రాష్ట్ర పీపీగా బీసీ వర్గానికి చెందిన తనను నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, రామ్మోహన్‌నాయుడికి ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు తల్లిదండ్రులు తవిటమ్మ, కృష్ణకు లక్ష్మీనారాయణ పాదాభినందనం చేశారు. కార్యక్రమంలో చిన్నతుంగాం సర్పంచి శిమ్మ గోవిందరావు పాల్గొన్నారు.

వంట చేస్తుండగా పేలిన గ్యాస్ సిలిండర్


ధ్వంసమైన రేకుల ఇల్లు

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం మండలం హెచ్.గోపాలపురంలో వంట చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బి.మహాలక్ష్మి రేకుల ఇంటిలో మంగళవారం ఉదయం 5 కిలోల గ్యాస్ సిలిండరుతో కూడిన స్టవ్‌పై వంట చేస్తున్నారు. మంట ఒక్కసారిగా ఎక్కువ కావడంతో ప్రమాదవశాత్తు సిలిండర్ పేలింది. దీంతో వంటగది రేకులు విరిగి పడ్డాయి. వంట సామగ్రి ధ్వంసమైంది. ఆర్ఐ బాబీ పండా ఘటనా స్థలాన్ని పరిశీలించి సుమారు రూ.20 వేలు వరకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చునని ప్రాథమిక అంచనా వేశారు. బాధితుల ఫిర్యాదుపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఆర్ఐ తెలిపారు.

ఒడిశా నుంచి కేరళ, కర్ణాటక

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు


కాశీబుగ్గలో గంజాయి స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

ఇచ్ఛాపురం, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: డిగ్రీ చదివిన యువకుడు వ్యసనాలకు బానిసయ్యాడు. గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు చిక్కాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను ఇచ్ఛాపురం సర్కిల్ కార్యాలయంలో మంగళవారం సీఐ ఎం.చిన్నంనాయుడు, పట్టణ ఎస్సై ఇ.చిన్నంనాయుడితో కలిసి నేరవిభాగం అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఒడిశాలోని గజపతి జిల్లా కుటునిగండ గ్రామానికి చెందిన గోపాల్‌సింగ్ అలియాస్ అంద్రుసింగ్ బీకాం చదివాడు. అదే జిల్లా రామఘడ గ్రామానికి చెందిన మిహిర్ కేరళ రాష్ట్రం ఎర్నాకుళంలో స్థిరపడి గంజాయి వ్యాపారం చేస్తున్నాడు. కిలో గంజాయికి రూ.పది వేలు ఇస్తామని ఆశ చూపగా స్నేహితుడి సలహా మేరకు గోపాల్‌సింగ్ అతనితో ఒప్పందం చేసుకున్నాడు. ఒడిశాలో సరకు కొనుగోలు చేసి అతనికి ఇచ్చాడు. నమ్మకం కుదరడంతో ఒడిశాలోని కొందమాల్ జిల్లా పడంగి గ్రామానికి చెందిన గంజాయి విక్రయదారు సంజీబ్‌ను గోపాల్‌సింగ్‌కు పరిచయం చేశాడు. అక్కడి నుంచే తరచూ సరకు కేరళకు తెప్పించుకుంటున్నాడు. ఇదే క్రమంలో గోపాల్‌సింగ్ గంజాయి తరలిస్తుండగా ఇచ్ఛాపురం రైలు నిలయం సమీపంలో పట్టణ పోలీసులకు చిక్కాడు. నిందితుడి వద్ద 5.310 కిలోల గంజాయి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని ఏఎస్పీ చెప్పారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


ఇచ్ఛాపురంలో వివరాలు వెల్లడిస్తున్న అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

కాశీబుగ్గలో ఇద్దరు..

ఒడిశా నుంచి బెంగళూరుకు గంజాయి తరలిస్తున్న ఇద్దరిని కాశీబుగ్గలో పోలీసులు అరెస్టు చేశారని సీఐ డి.మోహనరావు తెలిపారు. ఒడిశాకు చెందిన సాగర్ మాలిక్, దండువా కోహెర్ బ్రహ్మపుర నుంచి బస్సులో పలాస వచ్చారు. రైలులో బెంగళూరు వెళ్లడానికి కాశీబుగ్గ చేరుకున్నారు. వారి వద్ద సంచులను పోలీసులు తనిఖీ చేయగా 5 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. సరకు స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశారని సీఐ చెప్పారు.

కృష్ణాపురంలో కొట్లాట

8 మందిపై కేసు నమోదు

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: రణస్థలం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఓ పట్టా భూమి విషయంలో తలెత్తిన వివాదం కొట్లాటకు దారితీసింది. జేఆర్‌పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలో గొర్లె సత్యం కొన్నాళ్లుగా 25-6 సర్వే నంబరులో 53 సెంట్ల డీపట్టా భూమిలో నీలగిరి మొక్కలు వేసి సాగు చేస్తున్నారు. స్థలం ప్రధాన రహదారికి ఆనుకొని ఉండటంతో అతడి డీ పట్టా రద్దు చేయాలని అదే గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త నడుపూరి శ్రీను తహసీల్దారు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నెల రోజుల క్రితం సత్యం అదే భూమిలో కొబ్బరి మొక్కలు వేయగా సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు తొలగించారు. సత్యం గుర్తించి మంగళవారం ఉదయం ఊరి మధ్యలో తిడుతుండగా అక్కడే శ్రీను ఉండటంతో ఇరువురి నడుమ వాగ్వాదం జరిగింది. అనంతరం ఇరు కుటుంబాలు, బంధువులు కొట్లాటకు దిగారు. ఘటనలో నడుపూరి శ్రీను తలకు తీవ్రంగా, మరో ముగ్గురికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదుతో పోలీసులు 8 మందిపై కేసు నమోదు చేశారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	140	235	255

డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సాంఘిక, గిరిజన సంక్షేమశాఖలు సంయుక్తంగా 200 ఎస్సీ, ఎస్టీ మంది విద్యార్థులకు మూడు నెలలపాటు ఉచితంగా తర్ఫీదు అందించేందుకు శిక్షణ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ శాఖల జిల్లా అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలకు గతంలో డీఎస్సీ శిక్షణ ఇచ్చిన అనుభవం ఉండటంతో పాటు కనీసం 100 మంది ఉద్యోగాలకు ఎంపికై ఉండాలని చెప్పారు. గత మూడేళ్ల పాటు శిక్షణ సంస్థలకు కనీసం రూ.40 లక్షల వార్షిక టర్నోవర్ ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన సంస్థలు https://tender.apeprocurement.gov.in పోర్టల్‌లో వివరాలను పరిశీలించి .. పూర్తి వివరాలతో ఈ నెల 21లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం : 9440437129
పలాస : 8008574279
కవిటి గ్రామీణం : 8309638875
పలాస గ్రామీణం: 7386408926
కంచిలి గ్రామీణం: 9704568738

సమస్య: పలాస మండలం రెంటికోట రెడ్డిక వీధిలో సరైన రోడ్డు లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు**

సమాధానం: ఈ నెల 14న సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

- సద్గుణ, పంచాయతీ కార్యదర్శి, రెంటికోట

? ఇచ్ఛాపురం గంబీరు వీధి ప్రాంతంలో కుళాయి నీరు సక్రమంగా రావడం లేదు.

- బి.సత్యం, కె.కృష్ణ, ఇచ్ఛాపురం

● క్షేత్రస్థాయిలో పైపులైన్లు పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- పి.కామేశ్వరరావు, ఏఈ, ఇచ్ఛాపురం

? పలాస చాకలి వీధిలో కొళాయి నీరు తక్కువగా వస్తోంది. **- భాస్కరరావు, చాకలి వీధి, పలాస**

● పురుషోత్తపురం ప్రాంతంలో పైపులైను లీకులతో నీటి సరఫరా తగ్గింది. మరమ్మతులు చేస్తున్నాం. నాలుగైదు రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది. **- మాధవరావు, పురపాలక ఉద్యోగి, పలాస**

– న్యూస్‌టుడే, పలాస గ్రామీణం, ఇచ్ఛాపురం, పలాస

మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు

సోంపేట, కాశీబుగ్గ, న్యూస్‌టుడే: మద్యం దుకాణాల ఏర్పాటుకు ఔత్సాహికులు దరఖాస్తులు చేస్తున్నారు. సోంపేట, మందస, కంచిలి మండలాల్లో 12 దుకాణాలకు మంగళవారం 141 దరఖాస్తులు అందాయని అబ్కారీ సీఐ కె.బేబీ తెలిపారు. పలాస-కాశీబుగ్గ పట్టణాల్లో 7 దుకాణాలకు 36, పలాస మండలంలో 3కు 12, వజ్రపుకొత్తూరు మండలంలో 5 దుకాణాలకు 40 దరఖాస్తులు వచ్చాయని సీఐ మల్లికార్జునరావు చెప్పారు. ఆసక్తి గల వారి నుంచి బుధవారం సాయంత్రం వరకు దరఖాస్తులు తీసుకుంటామన్నారు.

మన పలాస.. మన బాధ్యత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో మన పలాస..మన బాధ్యత పేరిట నిర్వహించనున్న సామాజిక స్వచ్ఛ పరిశుభ్రత కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. ప్రభుత్వంపై ఆధారపడకుండా పరిసరాలను శుభ్రం చేసుకోవాలనే యోచనతో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. పలాసలోని తెదేపా కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 10న ఉదయం 6 గంటల నుంచి నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ రహదారులకు ఇరువైపులా ఉన్న పనికి రాని మొక్కలు, పొదల్ని తొలగించాలని కోరారు. తెదేపా, జనసేన, భాజపా నాయకులు, గ్రామ, వార్డు సచివాలయాలు, జాతీయ ఉపాధి హామీ పథకం సిబ్బంది, ప్రజలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. ప్రభుత్వం నుంచి ఒక్క పైసా ఆశించకుండా మన పలాస మన బాధ్యత కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొని ఎక్కడికక్కడ పొదల్ని తొలగించాలని కోరారు. పలాస నియోజకవర్గంలో మార్పునకు నాంది పలకాలనే ఉద్దేశంతో వినూత్నంగా ప్రజా భాగస్వామ్యంతో శ్రమదానం చేపట్టనున్నట్లు తెలిపారు. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావు, తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పి.విఠల్, పట్టణ కార్యదర్శి ఎస్.నవీన్, కౌన్సిలర్ జి.సూర్యనారాయణ, వి.రాజు, పి.వైకుంఠరావు, ఆర్‌అండ్‌బీ డీఈ ఎస్.రామినాయుడు, జేఈ డి.విక్రమ్ పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించరూ..

పలాస, న్యూస్‌టుడే: కిడ్నీ ఆసుపత్రిలో పని చేస్తున్న తమకు జీతాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని పొరుగు సేవల ఉద్యోగులు విజ్ఞప్తి చేశారు. పలాసలో మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరీషను కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఏడాది అక్టోబరు నుంచి పని చేస్తున్నామని.. ఈ ఏడాది జులై నుంచి జీతం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తప్పిదం జరిగిందని.. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నాడు కళకళ.. నేడు వెలవెల!

వైభవం కోల్పోయిన కంచిలి కొబ్బరి మార్కెట్

న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం, సోంపేట

ఒకప్పుడు దసరా వచ్చిందంటే కంచిలి కొబ్బరి మార్కెట్ కళకళలాడేది. వందల మంది కార్మికులు పనుల్లో నిమగ్నమయ్యే వారు. తోటల్లో పండగ వాతావరణం ఉండేది. ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావ పరిస్థితులు, ఎర్రనల్లి, తెల్లదోమ వంటి తెగుళ్లు చెట్లను ఆశించడం తదితర కారణాలతో ప్రస్తుతం దిగుబడి గణనీయంగా తగ్గిపోతోంది. ఫలితంగా కొబ్బరి మార్కెట్‌కు కళ తప్పడంతో కార్మికులకు ఉపాధి లేక వలస బాట పడుతున్నారు.


కొబ్బరి కాయల తొక్కలు తీస్తున్న కార్మికులు

● ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో సుమారు 30 వేల ఎకరాల్లో కొబ్బరి సాగు చేస్తున్నారు. గతంలో ఈ ప్రాంతాల్లో దిగుబడి అయిన కాయలు కంచిలి మార్కెట్‌కు చేరుకునేవి. ఇక్కడి నుంచి బిహార్, బెంగాల్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అయ్యేవి. ఉత్తరాది రాష్ట్రాల వర్తకుల డిమాండ్ మేరకు ఏడాది పొడవునా లారీల్లో కాయలు వెళ్లేవి. దసరా ఉత్సవాల సమయంలో ఎక్కువ ఆర్డర్లు ఉండేవి. దీపావళి అనంతరం బిహార్‌లో నిర్వహించే పండగకు రోజుకు 10 లారీలకు తగ్గకుండా వెళ్లేవి. ఆ సమయంలో విపరీతమైన గిరాకీ ఉండడంతో రైతులు అధిక ధరలు పొందేవారు.

ఇదీ పరిస్థితి

1999లో సంభవించిన తుపాను తరువాత కొబ్బరి రైతులు కుదేలయ్యారు. చెట్లకు ఎర్రనల్లి ఆశించడంతో కాయల పరిమాణం తగ్గిపోయింది. వ్యాపారులు గ్రేడింగ్ విధానం అమలులోకి తేవడంతో కష్టాలు మొదలయ్యాయి. అప్పటి నుంచి వరుసగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించడంతో దిగుబడి, కాయల పరిమాణం తగ్గి ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఆర్డర్లు క్షీణించాయి. 2018లో సంభవించిన తిత్లీ తుపాను ప్రభావంతో వజ్రపుకొత్తూరు, మందస మండలాల్లో 90 శాతం చెట్లు, ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 50 శాతం కొబ్బరి చెట్లు నేలకొరిగాయి. ఈ కారణంగా కంచిలి మార్కెట్ స్వరూపం మారిపోయింది. అప్పటి నుంచి ఒడిశాకు చెందిన చిన్న వర్తకులు నేరుగా రైతుల నుంచి కొబ్బరి కాయలు కొనుగోలు చేస్తున్నారు.

● ప్రస్తుతం దసరా ఉత్సవాల సమయంలోనూ రోజుకు లారీ కాయలు ఎగుమతి చేయడం గగనంగా మారింది. కంచిలి కొబ్బరి కార్మిక సంఘం లెక్కల ప్రకారం గతంలో 750 మంది కార్మికులు ఉండగా 150 మంది పని చేస్తున్నారు. గ్రామాల్లో పరోక్షంగా దీనిపై ఆధారపడిన వందల మంది కార్మికులు ఉపాధి కోల్పోయారు.

పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తే మేలు

కేరళ తరహాలో ఉద్దానంలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయాలి. దీని ఆధ్వర్యంలో క్రయవిక్రయాలు జరగాలి. ఈ ప్రాంతంలో కొబ్బరి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి రైతుల్ని ఆదుకోవాలి. ఉత్పత్తులకు గిరాకీ పెరిగి పూర్వ వైభవం వస్తుంది.

– కప్ప గోపీనాథ్, సీఐటీయూ మండల అధ్యక్షుడు, కంచిలి

రైతుల్ని ఆదుకుంటాం..

తెగుళ్ల బారి నుంచి కొబ్బరి తోటల్ని కాపాడుకోవడంపై రైతులకు అవగాహన కల్పించాలని ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించాం. కర్షకులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. కొబ్బరి బోర్డు, పరిశోధ కేంద్రాల ఏర్పాటుపై అధికారులతో చర్చిస్తాం. వ్యవసాయ శాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేస్తాం.

– బెందాళం అశోక్, ఎమ్మెల్యే, ఇచ్ఛాపురం

ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి

కవిటి గ్రామీణం, ఇచ్ఛాపురం గ్రామీణం, సోంపేట, న్యూస్‌టుడే: వరి పంట ప్రస్తుతం చిరుపొట్ట దశలో ఉన్నందున ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట మండలాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కవిటి మండలం కొజ్జిరియా వద్ద వరి పొలాలను వ్యవసాయాధికారి బి.దుర్గాప్రసాద్ పరిశీలించారు. ఇచ్ఛాపురం మండలం మండపల్లి, కేశీపురం గ్రామాల్లో వరి పంట క్షేత్రాలను వ్యవసాయాధికారిణి బి.భార్గవి సందర్శించారు. తెగుళ్లు, పురుగుకాటు కనిపిస్తే రైతు సేవా కేంద్రానికి రావాలని రైతులకు సూచించారు. సోంపేట మండలం కొజ్జిరియా వద్ద మామిడిపల్లి గ్రామాల్లో ఏవో బి.నరసింహమూర్తి పర్యటించారు. వరి పైరును ప్రస్తుతం ఆశిస్తున్న ఆకుముడత తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాటి నివారణకు సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు.

సగం పనులతో ఆపేశారు!



మందస మండలం కొండలోగాం క్లస్టర్ గ్రామ సచివాలయం భవన నిర్మాణ పనులు రెండేళ్ల కిందట ప్రారంభించి అసంపూర్తిగా ఆపేశారు. ఏడాది గడిచినా పురోగతి లేదని.. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. నిర్మించిన మేరకు బిల్లులు మంజూరు చేయలేదని.. నిధులు సమకూరగానే పనులు ప్రారంభిస్తామని సర్పంచి రోజా తెలిపారు.

– న్యూస్‌టుడే, హరిపురం (మందస)

చినుకు పడితే చెరువే..

కంచిలిలో వర్షం పడితే కంచమ్మతల్లి ఆలయ ముఖ ద్వారం నుంచి ఎస్‌బీఐ వరకు రహదారిపై గుంతల్లో నీరు చేరి చెరువులా మారుతోంది. వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వాహనాలు వెళ్తున్నపుడు సమీపంలో ఉన్న వారిపై బురద నీరు పడుతుండటంతో అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ మోహనరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా త్వరలోనే రహదారి నిర్మాణం పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం



ఒరుగుతూ..భయపెడుతూ



ఇచ్ఛాపురం పట్టణం కంద్ర కాలనీలో రెండు విద్యుత్తు స్తంభాలు ఒరిగిపోతూ స్థానికులను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. రక్షణ తీగ లేకపోవడం.. స్తంభాలను లోతుగా పాతకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని కాలనీ వాసులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఏఈ గోవిందరావు తెలిపారు.

–న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

మొక్కల వెనుక ఉందో భవనం!

ఇచ్ఛాపురం పురపాలక సంఘ పరిధిలో సుమారు 18 ఏళ్ల కిందట 20 చోట్ల ఎంపీ నిధులతో సామాజిక భవనాలు నిర్మించారు. పలుచోట్ల వినియోగిస్తుండగా సంతపేట వద్ద నిరుపయోగంగా ఉంది. గతంలో దీనిని ట్రాక్టర్ యూనియన్‌కు కేటాయించారు. ప్రస్తుతం చుట్టూ పనికి రాని మొక్కలు పెరిగిపోయాయి. బస్సు ప్రయాణికుల వసతికి లేదా మహిళా సంఘాల సమావేశ మందిరంగా ఉపయోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటామని పుర కమిషనరు నల్లి రమేష్ తెలిపారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం



బావి కాదు.. కుళాయి!



ఇచ్ఛాపురం పట్టణం ఉప్పాడ వీధి సమీపంలోని కుళాయి నుంచి ఇళ్లకు నీరు తీసుకెళ్లడానికి మహిళలు ఇబ్బంది పడుతున్నారు. చాలా ప్రాంతాల్లో రోజూ కుళాయి నీరు ఇళ్లకే వస్తోందని.. ఇక్కడ కుండీలో నిండిన నీటిని బకెట్‌తో తోడుకుని తీసుకెళ్లడానికి అవస్థలు తప్పడం లేదని వాపోతున్నారు. రూ.58 కోట్ల వ్యయంతో చేపట్టిన రక్షిత నీటి పథకం పూర్తయితే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని పుర కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కాశీబుగ్గ, పలాస, న్యూస్‌టుడే: కాశీబుగ్గ సమీపంలోని తాళభద్రకు చెందిన బి.గోవింద్ గత నెల 30న గుండెపోటుతో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులకు తెలుగు యువత మండల అధ్యక్షుడు, బొడ్డపాడుకు చెందిన కిక్కర ఢిల్లీరావు రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. ఈమేరకు మంగళవారం చెక్కు అందజేశారు. తెదేపా బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.కామేశ్వరరావు, కౌన్సిలర్ సూర్యనారాయణ, తెదేపా నాయకులు రాంబాబు, కూర్మారావు, నర్సింహులు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఢిల్లీరావు, తెదేపా నాయకులు

ద్విచక్ర వాహనం దహనం



ఇచ్ఛాపురం మండలం అరకభద్ర కాలనీకి చెందిన సైనికోద్యోగి రంగాల వాసుదేవ్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గ్రామీణ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు.

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

బాబూరావుకు సత్కారం



రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ ఛైర్మన్ వజ్జ బాబూరావును మంగళవారం నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు, ఇండియన్ బ్యాంకు ఉద్యోగులు, పలాస-కాశీబుగ్గ పట్టణాలకు చెందిన వైద్యులు సత్కరించారు. – న్యూస్‌టుడే, పలాస

పూర్వ విద్యార్థుల చేయూత

కవిటి మండలం రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1997-98 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు తమతో కలిసి చదువుకున్న ఇద్దరికి ఆర్థిక సాయం చేశారు. బొర్రపుట్టుగ గ్రామానికి చెందిన లోకనాథం వైద్య ఖర్చులకు రూ.20 వేలు, కొజ్జిరియా గ్రామానికి చెందిన మణికుమారికి రూ.20 వేలు అందజేశారు. పూర్వ విద్యార్థులు ప్రదీప్ సాహు, సౌజన్య, యర్రయ్య, దేవిక, లోకనాథం, భాస్కర్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం



దుర్గమ్మా.. కరుణించమ్మా


కంచిలిలో పూజలందుకున్న కంచమ్మతల్లి


వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లిలో ఘటాలతో మహిళల తిరువీధి


పలాస: మొగిలిపాడు సమీపంలో కొలువైన దుర్గాదేవి

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. పలు ఆలయాలు, మందిరాలు, మండపాల్లో అమ్మవారిని భక్తులు వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మహిళలు సామూహికంగా కుంకుమార్చన, లలితా సహస్ర నామ పారాయణం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, పలాస, కంచిలి, ఇచ్ఛాపురం గ్రామీణం, కంచిలి గ్రామీణం, వజ్రపుకొత్తూరు గ్రామీణం, ఇచ్ఛాపురం,


ఇచ్ఛాపురం: కాత్యాయినీ మాతగా దర్శనమిచ్చిన స్వేచ్ఛావతి అమ్మవారు

రోడ్లు అధ్వానం.. ఒళ్లు హూనం

న్యూస్‌టుడే, హరిపురం (మందస)

అడుగడుగునా గుంతలు..కనుచూపు మేర తారు ఉండదు. ఎక్కడికక్కడ రాళ్లు తేలి గోతులు ఏర్పడ్డాయి. బెర్మల్లో పొదలు అల్లుకున్నాయి. మలుపులు ప్రమాదకరంగా ఉండటంతో రాకపోకల సమయంలో ఒళ్లు హూనమవుతోంది. గత ప్రభుత్వం ఐదేళ్లలో అభివృద్ధికి చర్యలు తీసుకోకపోగా మరమ్మతులు సైతం చేపట్టలేదు. ఫలితంగా మందస ఉద్దానం ప్రాంత ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.


సరియాపల్లి సమీపంలో గుంతలు తేలిన రోడ్డు

అభివృద్ధికి నోచుకోని ఉద్దానం రహదారులు

● పాత జాతీయ రహదారి నుంచి సువర్ణాపురం మీదుగా బహాడపల్లి, టి.గంగువాడ, బిడిమి, హరిపురం నుంచి రట్టి మీదుగా రాంపురం, అంబుగాం నుంచి లోహరిబంద మీదుగా గెడ్డూరుతో పాటు మరికొన్ని రహదారులు పూర్తిగా పాడయ్యాయి. ● ఏటా మరమ్మతులు జరగాల్సి ఉండగా ఐదేళ్ల నిర్లక్ష్యానికి గురయ్యాయి. అంబుగాం నుంచి లోహరిబంద మీదుగా గొల్లలపాలెం రహదారి అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. ● కొర్రాయిగేటు నుంచి పూజానగర్ మీదుగా సువర్ణాపురం రహదారి గుంతలమయంగా మారింది. రెండు వైపులా బెర్మల్లో పొదలు అల్లుకోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ● బహాడపల్లి, చినబహాడపల్లి, సరియాపల్లి, ఉగ్రవానిపేట రహదారుల్లో తారు పొర ఊడి రాళ్లు తేలాయి. ఆయా మార్గాల్లో రాకపోకలకు వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ● నారాయణపురం నుంచి సువర్ణాపురం రహదారిని కలుపుతూ రహదారి నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో రాళ్లపై నడిచి వెళ్లడం కష్టంగా మారింది. ● పెద్దకేసుపురం, చినకేసుపురం రహదారుల పరిస్థితీ అంతే. రట్టి నుంచి బేతాళపురం మీదుగా రాంపురం రహదారిలో చాలా చోట్ల గోతులు ఏర్పడ్డాయి. లక్ష్మీపురం సమీపంలో గెడ్డపై నాలుగేళ్ల కిందట నిర్మించిన వంతెనపై వర్షపు నీరు నిలుస్తోంది. వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ● బహాడపల్లి నుంచి బిడిమి రహదారిలో కొత్తబిడిమి వద్ద దాదాపు కిలోమీటరు తారు పొర ఊడి గోతులు ఏర్పడ్డాయి. బహాడపల్లి నుంచి బిడిమి కూడలి మధ్య వర్షాలకు రహదారిపై పలు చోట్ల ఇసుక మేటలు ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దయనీయంగా మారిన రహదారులను అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వాన్ని ఉద్దానం ప్రజలు కోరుతున్నారు.


బహాడపల్లి వద్ద ...

ప్రతిపాదనలు పంపాం..

మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో బాగా పాడైన రహదారుల అభివృద్ధి, మరమ్మతులకు ఇటీవల ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. – జి.రవిబాబు, డీఈఈ, పంచాయతీరాజ్ శాఖ, పలాస

శ్రమించారు..పొదలు తొలగించారు

పలాస గ్రామీణం, వజ్రపుకొత్తూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పలాస మండలం దానగోర గ్రామస్థులు మంగళవారం శ్రమదానం చేశారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సవర జగన్నాయకులు ఆధ్వర్యంలో గ్రామంలో పేరుకుపోయిన చెత్తను సేకరించి దూరంగా పారబోశారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న పనికి రాని మొక్కల్ని తొలగించారు. వజ్రపుకొత్తూరు మండలం రిట్టపాడు-తాళభద్ర రహదారికి ఇరువైపులా పెరిగిన చెట్ల కొమ్మలు, పొదల్ని అసిరిపోలమ్మ ఆటో యూనియన్ సభ్యులు తొలగించారు.

సత్యసాయి భక్తుల సామాజిక సేవ

హరిపురం (మందస), న్యూస్‌టుడే: మందసలో గిరిజన ఆశ్రమ, గుడారిరాజమణిపురం ఉన్నత పాఠశాలల వద్ద సత్యసాయి సేవా సమితి సభ్యులు మొక్కలు నాటారు. ప్రేమతరు కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో సమితి సభ్యులు బి.భైరాగి, వి.ఈశ్వరరావు, అప్పారావు, డి.జగదీష్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు పీఎం సూర్యఘర్‌పై అవగాహన

పలాస, న్యూస్‌టుడే: పీఎం సూర్యఘర్ పథకంపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు పలాస సబ్‌డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీరు జి.యగ్నేశ్వరరావు తెలిపారు. కాశీబుగ్గ లిటిల్ ఏంజెల్స్ స్కూల్ ఎదురుగా ఎస్ఆర్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్ ఆవరణలో సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన శిక్షణ తరగతులు

పలాస గ్రామీణం: మండలంలోని ఉప సర్పంచులు, పంచాయతీకి ఇద్దరు చొప్పున వార్డు సభ్యులకు పలాస మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. పంచాయతీ పరిపాలన విధానాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ తదితర అంశాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో కారగ్గి వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి

●టెక్కలి ●నరసన్నపేట ●పాతపట్నం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: నందిగాం మండలం హర్షబాడ పంచాయతీ సాగరంపేటలో వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించాలి.

- జగదీష్, స్థానికుడు

★ క్షేత్రస్థాయిలో పరిశీలించి, సిబ్బందికి తెలియజేస్తాం. వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - చంద్రశేఖరరావు, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, హర్షబాడ - న్యూస్‌టుడే, నందిగాం

ఎర్రన్నాయుడికి నివాళి



హైకోర్టు పీపీగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి జిల్లాకు వచ్చిన మెండ లక్ష్మీనారాయణ నిమ్మాడ కూడలిలో మంగళవారం దివంగత నేత కింజరాపు ఎర్రన్నాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడు సోదరుడు హరివరప్రసాద్ ఇంటికి చేరుకుని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఏఎస్పీ ప్రభాకరరావు, మాజీ ఎంపీపీలు రామకృష్ణ, విజయలక్ష్మి, ఇతర నాయకులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, కోటబొమ్మాళి

నందితమోదిని.. విశ్వవినోదిని



నరసన్నపేట: కుంకుమార్చనలో మహిళలు



సంతబొమ్మాళి మండల కేంద్రంలో..

శరన్నవరాత్రి ఉత్సవాలు టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం నియోజకవర్గాల వ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిస్తున్నారు. పల్లెల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మహిళలు ముగ్గులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సహస్ర నామార్చనలు, హోమాలు జరిపారు. - న్యూస్‌టుడే బృందం



కోటబొమ్మాళి: పెద్దబమ్మిడి పంచాయతీలో ..



ఉర్లాం మార్కెట్ కూడలిలో ధనలక్ష్మి రూపంలో..



సారవకోట: అవలంగిలో పూజలందుకుంటున్న అమ్మవారు



ఎల్ఎన్‌పేట మండలం మల్లికార్జునపురంలో..

కూర్చున్న కొమ్మ నరుక్కుందామా..?

కబ్జా కోరల్లో వంశధార ఎడమ ప్రధాన కాలువ

- న్యూస్‌టుడే, నందిగాం

వంశధార ఎడమ ప్రధాన కాలువ నందిగాం మండలంలో సుమారు 25 కి.మీ. మేర ప్రవహించి దాదాపు 12 వేల ఎకరాలను సస్యశ్యామలం చేస్తోంది. ఏటా రైతులు కరవు బారిన పడకుండా కాపాడుతోంది. కూర్చున్న చెట్టు కొమ్మ నరుక్కున్న చందంగా కాలువ గట్టును రైతులే ఆక్రమిస్తున్నారు. దీంతో సాగునీటి వనరు చిన్నబోయి నీటి ప్రవాహం తగ్గుతోంది. శివారు ప్రాంతాలకు సకాలంలో అందకుండా పోతోంది.



పెద్దతామరాపల్లి సమీపంలో కాలువ గట్టుపై మొక్కలు పెంచుతున్న రైతులు

ఇదీ పరిస్థితి..

మండలంలో గొల్లవూరు వద్ద వంశధార ఎడమ ప్రధాన కాలువ ప్రవేశిస్తోంది. ఆదిలోనే హంసపాదు అన్న చందంగా గొల్లవూరు సమీపంలో కాలువ గట్టును ఆక్రమించి ఓ రైతు ఏకంగా పొలంగా మార్చి సాగు చేస్తున్నారు. మరికొంత మంది అరటి, టేకు తదితర చెట్లను పెంచుకోవడమే కాకుండా మిరప, టమాటా, వంకాయ తదితర కూరగాయలను పండిస్తున్నారు. పెద్దతామరపల్లిలో పరిస్థితి ఇలాగే ఉంది. తిత్లీ తుపానుకు మొత్తం చెట్లు విరిగిపోయినా వాటిని ఎటువంటి అనుమతులు లేకుండా అమ్ముకున్నారు. చిన్నతామరాపల్లిలో కొంతమంది వంశధార స్థలంలోనే కళ్లాలు ఏర్పాటు చేసి చిన్న చిన్న షెడ్లు వేసుకున్నారు. కాపుతెంబూరు, హరిదాసుపురం, సుభద్రాపురం, సింగుపురం, సవరబాణాపురం, ఆనందపురం, పాత్రుని వలస, కొత్తఅగ్రహారం, కణితివూరు వద్ద ఈ ఆక్రమణల జోరు ఎక్కువగా ఉంది. కణితివూరు వద్ద కాలువను పక్కన పొలంలోకి నీరు మళ్లించడానికి పిల్లకాలువ తీయడంతో వరదతో ఏటా పంటలు ముంపునకు గురవుతున్నాయి.



గొల్లవూరులో ఆక్రమించి పొలంగా మార్చిన వైనం

ఆక్రమణలు తొలగించాలి



వంశధార ప్రధాన ఎడమ కాలువ గట్టును కొంత మంది యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారు. రైతులకు సకాలంలో సాగునీరు అందాలంటే ఈ ఆక్రమణలు తొలగించాల్సిందే. అధికారులు స్పందించాలి.

- తమిరె చిన్నికృష్ణ, పెద్దతామరాపల్లి

గండ్లు పడుతున్నాయి



ఆక్రమణలతో తరచూ గండ్లు పడుతున్నాయి. ఏటా కాలువలో వరదనీటి మట్టం పెరిగితే ఇదే పరిస్థితి ఎదురవుతోంది. శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. నెల ఆలస్యంగా ఉభాలు వేస్తున్నాం.

- అట్టాడ సోమేశ్వరరావు, సైలాడ

కాలువ విస్తరణ తప్పనిసరి

వంశధార ఫేజ్-2 నిర్మాణ పనులు పూర్తయితే.. ప్రధాన ఎడమ కాలువ సామర్థ్యం పెంచాల్సి వస్తోంది. దీంతో విస్తరణ తప్పనిసరి. త్వరలో ఆక్రమణలన్నీ తొలగిస్తాం. రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడి చొరవతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- శేఖరరావు, ఈఈ, వంశధార ప్రాజెక్టు, టెక్కలి

లారీని ఢీకొన్న కారు

ఇద్దరికి గాయాలు

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలి మండలంలో జాతీయ రహదారిపై లచ్చన్నపేట సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖపట్నం జిల్లాకు చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. పలాసలో జీడి పప్పు కొనుగోలు చేసి కారులో తీసుకెళ్తుండగా అదుపుతప్పి ముందు వెళ్తున్న లారీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ఘటనలో కారు ముందు భాగం నుజ్జయింది. యజమాని కృష్ణ స్వల్పగాయాలతో బయటపడగా, కారు నడుపుతున్న శ్రీనివాసరావు కాలు విరిగింది. క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చేర్పించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు.

వ్యాధిగ్రస్థులపై వివక్ష తగదు

నందిగాం, న్యూస్‌టుడే: హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులపై వివక్ష తగదని, దానిని అంటు రోగంగా పరిగణించ కూడదని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి డైరెక్టర్ లక్ష్మణ్ అన్నారు. స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలు అనిత అధ్యక్షతన మంగళవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, సుకన్య పాల్గొన్నారు.

కొంచెం ఇటు వైపు చూడండి



నందిగాం మండలం నర్సిపురం కూడలి నుంచి గ్రామానికి వెళ్లే మార్గంలో విద్యుత్తు స్తంభం పక్కకు ఒరిగిపోయి ఉంది. ఈ రహదారి గుండా వందలాది వాహనదారులు నిత్యం రాకపోకలు చేస్తుంటారు. ప్రధాన మార్గంలో పరిస్థితి ఇలా ఉండటంపై పలువురు పెదవి విరుస్తున్నారు. ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి, స్తంభం సరి చేయాలని ఆయా ప్రాంతాలకు చెందిన వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయాన్ని విద్యుత్తు శాఖ ఏఈ నేతాజీ వద్ద ప్రస్తావించగా క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

- న్యూస్‌టుడే, నందిగాం

దారి పొడవునా ఇక్కట్లు..!

సారవకోట మండలం నౌతళ నుంచి అంగూరు వరకు సుమారు 15 కి.మీ. రోడ్డుకు ఇరువైపులా రెల్లి గడ్డి ఏపుగా పెరిగింది. సారవకోట నుంచి కొత్తూరు, బద్రి గ్రామాల మీదుగా బుడితి వరకు ఉన్న 10 కి.మీ. రహదారిలో పరిస్థితి ఇలాగే ఉంది. తర్లి టోల్ ప్లాజా వద్ద పరిస్థితిని చిత్రంలో చూడవచ్చు. రెల్లి గడ్డి పూత ఎగిరి కళ్లల్లో పడుతుండటంతో వాహన చోదకులు, పాదచారులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని ర.భ.శాఖ ఏఈ సరోజ వద్ద ప్రస్తావించగా చర్యలు తీసుకుంటానన్నారు. - న్యూస్‌టుడే, సారవకోట



కంచె లేదు.. రక్షణ కరవు..!



కొత్తూరు మండలం బలద గ్రామంలోని విద్యుత్ నియంత్రిక చుట్టూ రక్షణ కంచె లేకపోవడంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వ్యవసాయదారులు, కార్మికులు రాకపోకలు చేస్తుంటారు. దీంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని పలువురు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం కావడంతో ప్రమాదాలు జరగక ముందే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మణరావు మాట్లాడుతూ.. సిబ్బందికి తెలియజేసి పనికిరాని మొక్కలు తొలగించి, కంచె ఏర్పాటు చేస్తామన్నారు.

- న్యూస్‌టుడే, కొత్తూరు

నిత్య వెలుగులు నియంత్రించరూ



పోలాకి మండలంలోని గొల్లవలస గ్రామ స్వర్గధామం విద్యుద్దీపాలు నిత్యం వెలుగుతున్నాయి. గ్రామంలోని పలు వీధుల్లో ఇదే పరిస్థితి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పగటి వెలుగుల వల్ల పంచాయతీకి బిల్లులు అధికంగా రావడంతో పాటు దీపాలు పాడయ్యే అవకాశముందని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి రోహిణి వద్ద ప్రస్తావించగా సిబ్బందికి తెలియజేస్తామన్నారు. స్విచ్ బోర్డులు ఏర్పాటు చేసి, సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. - న్యూస్‌టుడే, పోలాకి

వీధి దీపాలు బాగు చేశారు

స్పందనకు వందనం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: టెక్కలిలో పాత బస్టాండు నుంచి గోపీనాథపురం రైల్వేగేటు వరకు, విద్యానగర్ కాలనీలో వీధి దీపాలను పంచాయతీ సిబ్బంది బాగు చేశారు. ఆయా ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొనడంతో స్థానికులు ఇబ్బందులు పడేవారు. దీనిపై 'ఈనాడు'లో వార్త ప్రచురితం కావడంతో పంచాయతీ కార్యదర్శి జగన్నాథరావు స్పందించారు. సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

పుస్తకాల పంపిణీకి చర్యలు

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: కోటబొమ్మాళి బాలుర ఉన్నత, ప్రకాష్‌నగర్ కాలనీ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల కోసం రూ.1.26 కోట్లతో అదనపు తరగతి గదులు నిర్మించారు. వీటిలో పుస్తకాలు నిల్వ చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై ఈనెల 6వ తేదీన 'ఒకే గది.. రెండు తరగతులు' శీర్షికతో ఈనాడులో వార్త ప్రచురితమవడంతో ఎంఈవోలు గోవిందరావు, ఎల్వీ ప్రతాప్ స్పందించారు. నిల్వచేసిన పుస్తకాలు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

జడ్డమ్మతల్లికి వెండి కిరీటం వితరణ

పాతపట్నం: పాతపట్నం మండలం బూరగాం గ్రామంలో వెలసిన జడ్డమ్మతల్లికి విశ్రాంత ఉపాధ్యాయుడు విశ్వనాథ్ బరోడా రూ.8 వేలు విలువ చేసే వెండి కిరీటం వితరణగా అందజేశారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలో గ్రామ పెద్దలకు ఆభరణం అందించినట్లు ఆయన చెప్పారు.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

టెక్కలి, న్యూస్‌టుడే: టెక్కలిలో లోతట్టు ప్రాంతాలను ఆర్డీవో కృష్ణమూర్తి మంగళవారం పరిశీలించారు. కాలువల్లో ప్రవహించే నీరు ఇతర ప్రాంతాలను ముంచెత్తకుండా ఆక్రమణలను తొలగించాలని అధికారులకు సూచించారు. తహసీల్దారు దిలీప్ చక్రవర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ రామకృష్ణ పాల్గొన్నారు.



బార్ కౌన్సిల్ స్టాంపు ఆవిష్కరణ

టెక్కలి: రాష్ట్ర బార్ కౌన్సిల్ ముద్రించిన రూ.250 స్టాంపును టెక్కలి బార్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఆవిష్కరించారు. న్యాయవాదులు, వారి గుమస్తాల సంక్షేమం కోసం ఈ స్టాంపులను న్యాయస్థానాల్లో వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వివేకానంద, కార్యదర్శి దివాకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.



10న ఆధార్ నమోదు శిబిరం

టెక్కలి పట్టణం, న్యూస్‌టుడే: నేషనల్ పోస్టల్ వీక్- 2024 సందర్భంగా ఈనెల 10న స్థానిక ప్రధాన తపాలా కార్యాలయంలో ఆధార్ నమోదు శిబిరం నిర్వహించనున్నట్లు హెడ్ పోస్టు మాస్టర్ ఎన్.తిరుపతిరావు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి శిబిరం జరుగుతుందని, ప్రజలు వినియోగించుకోవాలన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

మెళియాపుట్టి, నరసన్నపేట, నందిగాం, సారవకోట, న్యూస్‌టుడే: ఖరీఫ్ వరిసాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారులు సూచించారు. మంగళవారం పలుచోట్ల 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. వరిలో దోమపోటు విస్తరించకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు.



మెళియాపుట్టి: జాడుపల్లిలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

నిరుద్యోగులూ.. నిరాశ పడకండి

నరసన్నపేట, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో చతికిల పడిన వ్యవస్థలు ఇప్పుడిప్పుడే గాడిలో పడుతున్నాయని, నిరుద్యోగులు నిరాశ పడాల్సిన అవసరం లేదని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రోత్సహించి పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చేలా తోడ్పడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లత పాల్గొన్నారు. ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశారు.



ఉద్యోగ నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

జలుమూరు, న్యూస్‌టుడే: బాణసంచా దుకాణాల వద్ద, విక్రయాల్లో నిబంధనలు పాటించాలని నరసన్నపేట సీఐ జె.శ్రీనివాసరావు, తహసీల్దారు జి.లక్ష్మీనారాయణ, అగ్నిమాపకశాఖ అధికారి కె.పి.రెడ్డి పేర్కొన్నారు. జలుమూరు మండలం హరికృష్ణమ్మపేట వద్ద బాణసంచా దుకాణంలో పోలీస్, అగ్నిమాపక, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా మంగళవారం తనిఖీలు నిర్వహించి, దస్త్రాలు పరిశీలించారు. కార్బన్‌డై ఆక్సైడ్ సిలిండర్లు, ఇసుక, నీటి నిల్వలను పరిశీలించారు. గ్రామాలకు దూరంగా ఉండటంతో ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ అశోక్‌బాబు పాల్గొన్నారు.



హరికృష్ణమ్మపేటలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖ అధికారులు

ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

పోలాకి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని జొన్నాం గ్రామ కూడలి వద్ద వంశధార నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ జి.రంజిత్ తెలిపారు. వాహన చోదకుడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయండి

జలుమూరు, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకంపై ఈనెల 10న అవగాహన కార్యక్రమం ఉంటుందని విద్యుత్తు వినియోగదారులు హాజరై విజయవంతం చేయాలని విద్యుత్తుశాఖ ఏఈ వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. చల్లవానిపేట సంతోషిమాత కల్యాణమండపంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నందిగాం, న్యూస్‌టుడే: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజారావు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

అభివృద్ధికి కృషి చేయాలి

కొత్తూరు, న్యూస్‌టుడే: కొత్తూరు మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీడీవో నీరజ, తహసీల్దారు రవిచంద్రను కూటమి నాయకులు కోరారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వారిని సీనియర్ నాయకుడు ఎ.బైరాగినాయుడు, ఎ.మాధవరావు, ముగితి కృష్ణారావు, సీహెచ్.లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు.

భూసర్వే అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

కొత్తూరు, న్యూస్‌టుడే: భూసర్వే అక్రమాలపై తక్షణమే చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సిర్ల ప్రసాదరావు, రైతులు గేదెల కృష్ణారావు, పెద్దకోట యత్తిరాజు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కర్లెమ్మ రెవెన్యూ గ్రామం పరిధిలో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ చేయాలని కోరారు. ఈ మేరకు తహసీల్దారు రవిచంద్రకు వినతిపత్రం అందించారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

వ్యాధుల గుర్తింపులో అప్రమత్తంగా ఉండాలి

నరసన్నపేట, న్యూస్‌టుడే: కుష్టు, బోధ వ్యాధులను గుర్తించడంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ పారామెడికల్ అధికారి వాన సురేష్ సూచించారు. మాకివలస పీహెచ్‌సీలో మంగళవారం ఆరోగ్య శాఖ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యులు శ్రీకాంత్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాన సురేష్

వన్‌స్టాప్ సెంటర్లతో ఆడ పిల్లలకు రక్షణ

నరసన్నపేట న్యూస్‌టుడే: ఆడ పిల్లలకు రక్షణ కల్పించేందుకు వన్‌స్టాప్ సెంటర్లు తోడ్పడతాయని ఐసీడీఎస్ పీవో నాగమణి అన్నారు. స్థానిక ఎంపీడీవో, ఉపాధి కార్యాలయాల్లో జరిగిన అవగాహన సదస్సుల్లో ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు స్వేచ్ఛగా ఉండేందుకు వన్‌స్టాప్ సెంటర్లు వినియోగించుకోవాలని సూచించారు. హిమబిందు, కవిత పాల్గొన్నారు.

వేలిముద్ర పడదు.. వెతలు తీరవు..!

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: సంతబొమ్మాళి మండలంలోని పలు గ్రామ సచివాలయాల పరిధిలో బయోమెట్రిక్ పరికరాలు మరమ్మతులకు గురవడంతో సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పింఛన్లు, ఈకేవైసీ, వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రజలు నుంచి వేలిముద్రలు తీసుకోవాల్సిన సందర్భంలో మొరాయిస్తుండటంతో అవస్థలు ఎదుర్కొంటున్నారు. దీంతో ఇటు గ్రామ సచివాలయ సిబ్బందికి, అటు ప్రజలకు సమయం వృథా కావడంతో అసహనానికి గురవుతున్నారు.

పదుల సంఖ్యలో మొరాయింపు: మండలంలోని నౌపడ, సంతబొమ్మాళి, బోరుభద్ర, దండుగోపాలపురం, ఉమిలాడ తదితర గ్రామ సచివాలయాల్లో పదుల సంఖ్యలో వేలిముద్రల స్కానర్లు పనిచేయడం లేదు. పలుమార్లు సరిచేయాలని తెలియజేసినా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి కొత్త పరికరాలు సరఫరా అవ్వకపోవడం, సంబంధిత సిబ్బంది నూతనంగా కొనుగోలు చేయకపోవడంతో ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.



నౌపడలో పనిచేయని బయోమెట్రిక్ పరికరాలు

★ **చర్యలు తీసుకుంటాం:** గ్రామ సచివాలయం పరిధిలో పనిచేయని పరికరాలు వివరాలు సేకరించాం. త్వరలో కొత్తవి అందజేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

- ప్రేమలీలా, ఎంపీడీవో, సంతబొమ్మాళి

ఆధ్యాత్మికత భావన అలవరుచుకోవాలి

నరసన్నపేట, న్యూస్‌టుడే: ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మికత భావన అలవరుచుకోవాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు సూచించారు. నరసన్నపేటలోని మారుతీనగర్ సత్యసాయి మందిరంలో అఖండ నామ సంకీర్తన ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మికత పెంపొందితే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు రామచంద్రరావు, నాగేశ్వరరావు, అమ్మాయమ్మ, అనాధగుప్త, వి.వి.ఎస్.ఎన్.మూర్తి పాల్గొన్నారు.

తెరపై ఈనాడు

★ కీర్తన: రామ్‌నగర్ బన్నీ ★ కీర్తిక: సత్యం సుందరం ★ కిన్నెర సినీమాక్స్: దేవర ★ ఎస్‌వీసీ(రామలక్ష్మణ): దక్షిణ ★ సూర్యమహల్: శ్వాగ్ ★ సరస్వతి: దేవర ★ చంద్రమహల్: మత్తు వదలరా-2 ★ మారుతి: చిట్టి పొట్టి

– న్యూస్‌టుడే, అరసవల్లి

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

ఇసుక లారీ పట్టివేత

ఎచ్చెర్ల(రణస్థలం), న్యూస్‌టుడే: మండలంలోని పైడిభీమవరం చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో జే.ఆర్.పురం పోలీసులు ఒక ఇసుక లారీ సీజ్ చేశారు. జిల్లా నుంచి విశాఖ వైపు వెళ్తుండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు జే.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

జూదరుల అరెస్టు

పొందూరు, న్యూస్‌టుడే: పొందూరు మండలం గారపేట గ్రామ సమీపంలో సోమవారం రాత్రి తొమ్మిది మంది జూదరులను పోలీసులు అరెస్టు చేశారు. రూ.1,06,800 నగదుతోపాటు 11 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్.ఐ. సత్యనారాయణ తెలిపారు.

రైతులకు ఈకేవైసీ తప్పనిసరి



వరి, మామిడి పంటల నమోదు వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీవో సాయి ప్రత్యూష

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఈ-క్రాప్‌లో నమోదుతోపాటు ఈకేవైసీ తప్పనిసరిగా చేయాలని ఆర్డీవో సాయి ప్రత్యూష అన్నారు. మండలంలోని తమ్మినాయుడుపేట గ్రామంలో మంగళవారం ఈ క్రాప్ నమోదును పరిశీలించారు. ఈకేవైసీకి ఈ నెల 9వ తేదీ వరకూ గడువు ఉందన్నారు. భవిష్యత్తులో సాగుచేసిన పంటలు ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నా, పెట్టుబడి, సున్నా వడ్డీ రాయితీలతోపాటు ప్రభుత్వ ప్రోత్సాహకాలు పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు.

ఎరువుల దుకాణంలో జేసీ తనిఖీలు



పాలకండ్యాం వద్ద పురుగుమందు దుకాణాల్లో దస్త్రాల వివరాలు పరిశీలిస్తున్న సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

జి.సిగడాం, పొందూరు, న్యూస్‌టుడే: జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ జి.సిగడాం మండలం సంతవురిటి గ్రామంలోని వెంకటరావుకు చెందిన వరి క్షేత్రాన్ని సందర్శించారు. ఈ క్రాప్, ఈకేవైసీపై అవగాహన కల్పించారు. మడ్డువలస కాలువ నీరు అందడం లేదని అన్నదాతలు తెలియజేయగా చర్యలు తీసుకుంటామన్నారు. పాలకండ్యాం ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ● పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు పాల్గొని అధికారుల నుంచి సాగుకు సంబంధించిన సలహాలు పొందాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. పొందూరు మండలం కనిమెట్ట గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులకు పంటసాగు యాజమాన్యం గురించి వివరించారు.

పశు బీమా.. రైతుకు భరోసా

అవగాహన లేక ఆసక్తి చూపని పశుపోషకులు

మూగజీవాలు అర్ధాంతరంగా చనిపోతే చెల్లించే బీమాపై అధికారులు రైతులకు అవగాహన కలిగిస్తున్నారు. రైతులు కష్టపడి సంపాదించిన సొమ్ముతో కొన్న జీవాలు మృతి చెందితే.. ప్రభుత్వం పరిహారం అందజేస్తుంది. ఇది కొంతమేర పశు రైతుల నష్టాన్ని తగ్గిస్తుంది. ఇందులో భాగంగా రైతు నిర్దేశిత ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలి. లబ్ధిదారుడు ఎస్సీ, ఎస్టీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారైతే 20 శాతం ప్రీమియం, మిగతా వారు 50 శాతం చెల్లించాలి.

– న్యూస్‌టుడే, గార, గుజరాతీపేట

పరిహారం ఇలా..

❖ ఒక కుటుంబంలో గేదెలు, ఆవులు, ఎద్దులు, దున్నలు ఉన్నట్లయితే 5 జీవాలకు మాత్రమే బీమా వర్తిస్తుంది. మేలు జాతికి చెందినవైతే ఒక్కో జీవానికి రూ.30 వేలు, అంత కన్నా తక్కువ స్థాయిలో ఉంటే రూ.15వేల వరకు పరిహారం అందజేస్తారు. ఎస్సీ, ఎస్టీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలు, ఇతరులకు ప్రీమియం కింద నిర్ణయించిన సొమ్ము వేర్వేరుగా ఉంటుంది. ❖ గొర్రెలు, మేకలు, పందులు ఉంటే ఒక్కో జీవానికి రూ.6 వేలు చెల్లిస్తారు.



నమోదు ఇలా

సచివాలయాల పరిధిలోని కియోస్క్‌లో లాగిన్ అయి వివరాలు నమోదు అనంతరం నిర్దేశిత ప్రీమియం చెల్లించాలి. అనంతరం రైతు సేవా కేంద్రాల్లో అంతర్జాలంలో నమోదు చేస్తారు. గతంలో కేవలం ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు మాత్రమే బీమా పరిహారం అందజేసేవారు. ప్రస్తుతం దున్నలు, ఎద్దులు, పందులను కూడా చేర్చారు. ఒకవేళ బీమా చేయించిన జీవాన్ని విక్రయిస్తే 7 రోజుల్లో బీమా కంపెనీకి సమాచారం అందించి కొనుగోలు దారుడి వివరాల సమాచారం పొందుపరచాలి. ఈ ఏడాది 17,866 జీవాలకు బీమా చేశారు.

లబ్ధిచేకూరుతుంది

ప్రీమియం చెల్లింపులో రైతు భాగస్వామ్యం ఉంటే, పరిహారం చెల్లింపులో బీమా కంపెనీ బాధ్యత ఉంటుంది. చెల్లించే ప్రీమియం తక్కువగా ఉండటంతో పరిహారం ద్వారా రైతుకి కొంత మేర లబ్ధి చేకూరుతుంది. ఈ పథకంపై అవగాహన కల్పిస్తున్నాం.

– మురళీధర్ (జేడీ, పశుసంవర్ధక శాఖ, శ్రీకాకుళం)

ఫరీదుపేట సర్పంచి చెక్‌పవర్ రద్దు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట సర్పంచు కొత్తకోట పూర్ణచంద్రరావు చెక్‌పవర్‌ను ఎంపీడీవో సీపాన హరిహరరావు రద్దు చేశారు. తెదేపా పాలనలో ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల బిల్లులు ఉద్దేశపూర్వకంగా చెల్లించలేదనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. 2022లోనే జిల్లా పంచాయతీ అధికారి చెక్‌పవర్ రద్దు చేస్తూ ఆదేశాలు ఇచ్చినప్పటికీ అమలు కాలేదు. దీంతో గ్రామానికి చెందిన తెదేపా నేత, న్యాయవాది కొత్తకోట అమ్మినాయుడు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో తక్షణ చర్యలు తీసుకున్నారు.

సర్వజనాసుపత్రిని అభివృద్ధి చేస్తాం



ఎమ్మెల్యే శంకర్‌కు సమస్యలు వివరిస్తున్న సూపరింటెండెంట్ షకీలా

గుజరాతీపేట(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజనాసుపత్రిని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు మెరుగైన వైద్యసేవలందేలా చూస్తామని చెప్పారు. బుధవారం ఆసుపత్రిలోని వైద్యులతో సమావేశం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డాక్టర్ షకీలా ఎమ్మెల్యేకు పలు సమస్యలను వివరించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు రెడ్డి గిరిజా శంకర్, అంధవరపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం

పురపాలిక పరిధిలోని 23 వార్డులకు 73 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నా.. పారిశుద్ధ్యం పడకేసింది. ఎక్కడికక్కడ వ్యర్థాలు నిల్వ ఉండిపోవడంతో దుర్గంధంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మెట్టక్కివలస ప్రధాన రహదారి, హట్కోకాలనీ, గేదెలవానిపేట, ఊసవానిపేట, ప్రధాన రహదారి, కృష్ణాపురం జంక్షన్, గేటు ఇందిరాగాంధీ జంక్షన్, పాత ఆమదాలవలస, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో నిర్వహణ తీసికట్టుగా ఉంది. మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాదు దృష్టికి తీసుకెళ్లగా సకాలంలో పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

-న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం



పునాదులకే పరిమితం!



జి.సిగడాం మండలం సీతంపేట గ్రామంలో రైతు సేవా కేంద్రం పునాదులకే పరిమితమైంది. గత వైకాపా పాలనలో భవన నిర్మాణాలు సకాలంలో బిల్లులు రాకపోవడంతో గుత్తేదారులు చేతులు ఎత్తేశారు. దీంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. సీతంపేట గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రం పునాదిస్థాయిలో ఉండటంతో వైద్య సేవలు అందుబాటులేదని గ్రామస్థులు వాపోతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. పంచాయతీరాజ్ ఏఈ ప్రీతి ప్రస్తావించగా త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. -న్యూస్‌టుడే, జి.సిగడాం

మెళకువలతో అధిక దిగుబడులు

ఆమదాలవలస గ్రామీణం, సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: రైతులు సాగులో మెళకువలతో పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బొడ్డేపల్లి పద్మనాభం అన్నారు. కొత్తకోట గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు సూచనలు చేశారు. ❖ రైతులు తమ పంటలను యాజమాన్య పద్ధతిలో పండిస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించగలరని అన్నారు. మంగళవారం ఆమదాలవలస మండలం రామచంద్రాపురం పంచాయతీ రామచంద్రాపురం గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయ శాఖ మండల అధికారి మెట్ట మోహనరావు పాల్గొని చీడపీడలు, దోమ పోటుపై రైతులకు అవగాహన కల్పించారు.



కొత్తకోట గ్రామంలో పొలం బడి

ఎస్పీని కలిసిన ఆర్డీవోలు



ఎస్పీకి మొక్క అందజేస్తున్న ఆర్డీవో ప్రత్యూష

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: శ్రీకాకుళం, టెక్కలి ఆర్డీవోలు సాయిప్రత్యూష, కృష్ణమూర్తి ఎస్పీ మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం కలిసి ఆయనకు మొక్క అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిని అభినందించారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు.

సౌరశక్తితో ప్రయోజనం



మాట్లాడుతున్న ఎస్‌ఈ కృష్ణమూర్తి

పొందూరు, న్యూస్‌టుడే: సూర్యఘర్ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న సౌరవిద్యుత్తును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్తుశాఖ ఏఈఈ ఎస్.కృష్ణమూర్తి అన్నారు. పొందూరు విద్యుత్తు ఉప కేంద్రంలో మంగళవారం పథకంపై అవగాహన కల్పించారు. ఇంటిపై ఏర్పాటు చేసుకుంటే విద్యుత్తు బిల్లు తక్కువగా వస్తుందన్నారు.

క్రీడాకారులకు అభినందన

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని శ్రీకాకుళం నగరంలోని చైతన్య సహకార జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డా.జామి భీమశంకర్ ఆకాంక్షించారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కళాశాల విద్యార్థులు శిష్టు హిమత్‌కుమార్, ముంత గాయత్రి సత్తా చాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారిని మంగళవారం అభినందించారు.

కస్తూర్బా ఖాళీల ప్రకటనలో తప్పులు

పొందూరు, న్యూస్‌టుడే: కస్తూర్బాల్లో ఖాళీల భర్తీకి విడుదల చేసిన ప్రకటనలో తప్పు ఉందని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసన్న, కృష్ణారావు తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోని గార కస్తూర్బా పాఠశాలలో పీజీటీ భౌతికశాస్త్రం పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ చూపించలేదన్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఉపాధ్యాయులు జులైలో రాజీనామా చేశారని మంగళవారం వెల్లడించారు. ఖాళీ చూపకపోవడంతో అభ్యర్థులు అవకాశం కోల్పోతారన్నారు. ఇప్పటికైనా సరి చేయాలని కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



శాంసంగ్ మొబైల్ దుకాణం వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

కొత్తరోడ్(శ్రీకాకుళం),న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంసంగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి పి తేజేశ్వరరావు డిమాండు చేశారు. తమిళనాడులోని పెరంబుదూరులోని శాంసంగ్ కార్మికులు చేపడుతున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా శ్రీకాకుళంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద ఉన్న శాంసంగ్ మొబైల్ దుకాణం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని చట్టబద్ధంగా యూనియన్ ఏర్పాటు చేసేలా సమస్యలు పరిష్కరించకుండా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులు ఏర్పాటు చేసిన యూనియన్‌ను గుర్తించాలని, సమస్యలను పరిష్కరించాలని కోరినప్పటికి పట్టించుకోవడంలేదన్నారు. నైపుణ్యం ఉన్న కార్మికులకు వేతనం పెంచాలని డిమాండు చేశారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె సూరయ్య, ఎ సత్యనారాయణ, ఆర్ ప్రకాశరావు, గోవర్ధనరావు, రామప్పడు, రమణ, రవికుమార్, బలరాం తదితరులు పాల్గొన్నారు.

కరుణించే తల్లివి నీవు..!



సరుబుజ్జిలి: పురుషోత్తపురంలో దుర్గాదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి ప్రమీలారాణి

దసరా శరన్నవరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. అమ్మవారి అవతారాలను దర్శించుకుని భక్తులు పరవశం చెందుతున్నారు. అమ్మవారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, నారికేళాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో, పసుపు నీళ్లతో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేస్తున్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. -న్యూస్‌టుడే, బృందం



శ్రీకాకుళం సాంస్కృతికం: మెండిటివీధిలో శిర్డిసాయి మందిరంలో లక్ష్మీదేవిగా లలితాదేవి అలంకరణ,ఊరేగింపు



ఆమదాలవలస: శాకాంబరీగా పాల పోలమ్మ



ఎచ్చెర్లలో మహిళల పూజలు



పొందూరులో.. అమ్మవారికి అభిషేకం



శ్రీకాకుళం సాంస్కృతికం: కలశాలతో ఊరేగింపు



ఆమదాలవలస పట్టణం: పాలకొండ కోటదుర్గమ్మ ఆలయంలో తమ్మినేని

కులం పేరిట దూషణ.. కేసు నమోదు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మండలం బడివానిపేట గ్రామానికి చెందిన చల్ల నిశిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్తతోపాటు మరో అయిదుగురిపై అట్రాసిటీ కేసు నమోదైంది. ఎచ్చెర్ల ఎస్సై వి.సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిశిత అదే గ్రామానికి చెందిన బడి రవిని 2021లో ప్రేమ వివాహం చేసుకుంది. కొంత కాలంగా అదనపు కట్నం కావాలని భర్తతోపాటు అతడి కుటుంబ సభ్యులు వేధిస్తుండటంతో విడిపోవాలనుకున్నారు. ఇటీవల భర్త, అతడి కుటుంబ సభ్యులు కులం పేరుతో దూషించడంతో ఆమె ఫిర్యాదు మేరకు ఆరుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవీ..ఇవీ..అన్నీ

క్రికెట్ పోటీలు ప్రారంభం

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: శ్రీ సత్యసాయిబాబా జయంతి సందర్భంగా శ్రీ సత్యసాయి క్రికెట్ లీగ్ నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుల లక్ష్మణరావు అన్నారు. ఎచ్చెర్ల మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల క్రీడ మైదానంలో మంగళవారం జోనల్‌స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభించారు.

దసరా ఉత్సవాలు


శ్రీకాకుళం సాంస్కృతికం న్యూస్‌టుడే: నగరంలో పెద్దపాడు రహదారిలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థలో దసరా ఉత్సవాలు నిర్వహించారు. లింగాష్టకం, లలితా సహస్రనామ పారాయణం, సత్సంగం, భజన కార్యక్రమాలు జరిగాయి. డా. అమ్మన్నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని సుదర్శన క్రియ, సాధన ప్రయోజనాలు గురించి మాట్లాడారు.

పొందూరులో అన్న సంతర్పణ

పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పొందూరు పట్టణంలో నాయుడు వీధిలో వినాయక మహోత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం భారీగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీటీసీ అనకాపల్లి వాణిశ్రీ రంగనాయకులు ప్రారంభించారు.

నూతన కార్యవర్గ ఎన్నిక

శ్రీకాకుళం నగరం, పొందూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నాయీబ్రాహ్మణ సంఘం శ్రీకాకుళం నగర నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం ఆ సంఘ కార్యాలయంలో జరిగింది. అధ్యక్ష, కార్యదర్శులుగా కె.నాగరాజు, జి.శ్రీనివాస్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



❖ పొందూరు గ్రామానికి చెందిన వావిలపల్లి రాజారావు మస్టారు శ్రీశ్రీ కళావేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలువురు ఆయనకు పూలమాలలు వేసి అభినందించారు.

భాజపా నేతల సంబరాలు

బలగ(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా జిల్లా భాజపా నేతలు సంబరాలు చేసుకున్నారు. శ్రీకాకుళం నగరంలోని అంబేడ్కర్ కూడలి వద్ద అందరికీ మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరావు, అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, కార్యవర్గ సభ్యులు రవిబాబ్జి, సీనియర్ నాయకులు చల్లా వెంకటేశ్వరరావు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్‌కు పురస్కారాలు



అవార్డులతో నటుకుల మోహన్, రవికుమార్

శ్రీకాకుళం సాంస్కృతికం, న్యూస్‌టుడే: లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ అందించిన సేవలకుగాను వివిధ విభాగాల్లో 5 పురస్కారాలు లభించాయని క్లబ్ పూర్వ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ ఛైర్మన్ బాడాన దేవభూషణరావు తెలిపారు. విశాఖపట్నంలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డులు అందుకున్నట్లు చెప్పారు. భవిష్యత్తులోనూ లయన్స్‌క్లబ్ సేవలు కొనసాగిస్తామన్నారు.

హోంగార్డుకు వీడ్కోలు

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: ఉద్యోగ విరమణ అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఎస్పీ మహేశ్వరరెడ్డి సూచించారు. జిల్లా హోంగార్డు విభాగంలో పని చేస్తూ మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన తారకేశ్వరరావును జిల్లా పోలీసు కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ ఆయనకు తక్షణ సాయం కింద రూ.5 వేలు అందించారు.

సుధాకర్‌కు సత్కారం

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: విశాఖపట్నంలో ఇటీవల నిర్వహించిన 10 కి.మీ. పరుగు పందెంలో నగరానికి చెందిన సంజీవి నళిని సుధాకర్ పాల్గొని 63.02 నిమిషాల్లో పూర్తి చేసి ద్వితీయ స్థానం సాధించారు. ఈ సందర్భంగా ఆయనను మంగళవారం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఆవరణలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. వికలాంగుల సంక్షేమశాఖ ఏడీ కె.కవిత, జిల్లా ఉపాధికల్పనాధికారి సుధ, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్లు గేదెల ఇందిరాప్రసాద్, పి.జి.గుప్తా, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు ఎస్.జోగినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచండి



కమిషనర్ ప్రసాదరావుకు వినతి పత్రం అందిస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు

శ్రీకాకుళం నగరం, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ పరిధిలో పొరుగు సేవల పద్ధతిలో పని చేస్తున్న కార్మికులు, సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావును మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లాశాఖ(ఏఐటీయూసీ అనుబంధం) నాయకులు కె.అప్పలరాజు, టి.తిరుపతిరావు కోరారు. మంగళవారం కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి ఈ మేరకు వినతి పత్రం అందించారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా సిబ్బంది, కార్మికుల వేతనం పెంచడంతో పాటు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఎస్.పార్థసారథి, ఎ.గణేష్, ముకేష్‌కుమార్, రాజేశ్వరి, మాధురి, జయశ్రీ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సైకిల్ యాత్రికుడికి స్వాగతం

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: కాళీమాత దర్శనానికి కోల్‌కతాకు సైకిల్‌యాత్ర చేపట్టిన విశాఖపట్నం జిల్లా అచ్చుతాపురానికి చెందిన మహేంద్రకు శ్రీకాకుళం ఆదిత్య జుంబా నడక సంఘ ప్రతినిధులు మంగళవారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. శ్రీకూర్మం ఆలయ ఇన్‌ఛార్జి ఈవో జి.గురునాధరావు, సంఘ ప్రతినిధులు బి.దేవీప్రసాద్, కింతలి సాయికుమార్, బి.గారయ్య, రామకృష్ణ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ పట్రస్ జిల్లా కన్వీనర్ ఎస్.జోగినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో ముందుకెళితే గ్రామాభివృద్ధి

ఎచ్చెర్ల, సరుబుజ్జిలి, న్యూస్‌టుడే: పంచాయతీ పరిపాలన, కార్యకలాపాల్లో అన్ని వర్గాల వారిని భాగస్వామ్యం చేస్తూ గ్రామాభివృద్ధికి కృషిచేయాలని ఏపీఎస్ఐఆర్‌డీ సహాయ కమిషనర్ కృష్ణమోహన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజుల నుంచి జరుగుతున్న ఉపసర్పంచులు, వార్డు సభ్యుల శిక్షణ సమావేశాన్ని మంగళవారం పరిశీలించి సూచనలు చేశారు. ప్రణాళిక బద్ధంగా అభివృద్ధి సాధించాలన్నారు. ❖ పంచాయతీ పరిపాలనపై ప్రభుత్వం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను గ్రామాల్లో పదిమందికి తెలియజేయాలని ఎంపీడీవో ఎం.పావని అన్నారు. 100 రోజుల ప్రణాళికపై మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు.



మాట్లాడుతున్న ఏపీఎస్ఐఆర్‌డీ సహాయ కమిషనర్ కృష్ణమోహన్